http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

శనివారం 1 ఆగస్టు 2026

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5    వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

## మీ పెట్టుబడులకు రక్షణ

- వ్యాపారాలకు అనువైన వాతావరణం కల్పిస్తున్నాం
- ఫార్చ్యూన్ 500 కంపెనీలు ఫ్యూచర్ సిటీకి రావాలన్నదే ప్రభుత్వ లక్ష్యం
- సీఐఐ ఉత్తరాది ప్రతినిధులతో భేటీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని తెలంగాణను క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించాం



హైదరాబాద్

పెట్టుబడులకు సురక్షిత స్థానమైన తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఉత్తరాది ప్రతినిధులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. పెట్టుబడులకు రక్షణగా నిలుస్తామని హామీ ఇచ్చారు. సీఎంతో సీఐఐ ఉత్తర భారత ప్రతినిధులు శుక్రవారం భేటీ అయ్యారు. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పాలనలో అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్‌రోడ్డు, ఫార్మా, ఐటీ కంపెనీలు హైదరాబాద్‌కు తరలివచ్చాయని సీఎం తెలిపారు. 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ పాలనలో కొన్ని పాలసీలు ప్రవేశపెట్టారని.. వాటిని కొనసాగిస్తూనే తాము సరికొత్త పాలసీలు తీసుకువచ్చామని చెప్పారు. రాష్ట్రంలో - మిగతా3లో



## పీవోకేలో పాకిస్థాన్ దమనకాండపై భారత్ సీరియస్

- అంతర్జాతీయ సమాజం దృష్టి సారించాలని పిలుపు
- పాకిస్థాన్‌ను జవాబుదారి చేయాలని భారత్ డిమాండ్- పీవోకేలో 40మంది పౌరులు మృతి చెందారన్న భారత్
- మరెంతోమంది గాయపడ్డారని భారత్ ఆందోళన



## మరోసారి ఎల్ఆర్ఎస్ గడువు పెంపు

- నవంబరు 30 వరకు ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించేందుకు అవకాశం
- ఛార్జీలు 25 శాతం రాయితీతో చెల్లించే అవకాశం
- దరఖాస్తు రిజెక్టైతే ప్రాసెసింగ్ ఛార్జీలు మినహా 90 శాతం తిరిగి చెల్లించనున్న ప్రభుత్వం

హైదరాబాద్

అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ రాయితీ గడువును రాష్ట్ర ప్రభుత్వం మరోసారి పొడిగించింది. నవంబరు 30 వరకు ఎల్ఆర్ఎస్ ఫీజులు, ఛార్జీలు 25 శాతం రాయితీతో చెల్లించేందుకు అవకాశం కల్పిస్తూ మెట్రోపాలిటన్ ఏరియా అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ప్రత్యేక సీఎస్ జయేష్ రంజన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎల్ఆర్ఎస్ కోసం రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల 67 వేల 107 మంది దరఖాస్తు - మిగతా3లో



## "కొంచెమైనా సిగ్గు మిగిలి ఉంటే- అమిత్ షాతో రాజీనామా చేయించండి"

- నీట్ లీకేజీ నిరసనకారులపై మోదీ సర్కార్‌వి కక్షసాధింపు చర్యలు
- మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆరోపణలు

## సరికొత్త శిఖరాలకు భారత్- యూకే వ్యూహాత్మక భాగస్వామ్యం

- ఇరు దేశాల ప్రధానుల ఫోన్ సంభాషణ
- బ్రిటన్ నూతన ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆండీ బర్న్‌హామ్‌తో ఫోన్‌లో మాట్లాడిన భారత ప్రధాని మోదీ
- ఇరు దేశాల మధ్య ఈ నెలలోనే అమల్లోకి వచ్చిన చారిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం
- వ్యాపారాలు, కార్మికులు, వినియోగదారులకు కొత్త అవకాశాలను సృష్టిస్తుంది





## తెలంగాణలో ఎస్ఐఆర్ గడువు తేదీ మరోసారి పెంపు

- తెలంగాణ రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియ గడువు తేదీ మరోసారి పొడిగించిన ఈసీ
- ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించే గడువు ఆగస్టు 10 వరకు పొడిగింపు
- రాష్ట్రవ్యాప్తంగా 77.12 శాతం ఎన్యూమరేషన్ పూర్తి
- ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ పూర్తయినప్పటికీ, ఓటర్లు వాటిని నింపి ఇవ్వాల్సి ఉంది
- ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తవ్వాల్సి ఉంది



హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) గడువు తేదీని ఎన్నికల సంఘం(ఈసీ) మరోసారి పొడిగించింది. ఆగస్టు3వ తేదీతో పూర్తి కావాల్సిన ఎన్యూమరేషన్ ప్రక్రియను ఆగస్టు 10వ తేదీ వరకు పొడిగిస్తూ ఈసీ నిర్ణయం తీసుకుంది. ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ పూర్తయినప్పటికీ, ఓటర్లు వాటిని నింపి ఇవ్వాల్సి ఉంది. ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తవ్వాల్సి ఉంది. జూన్ 25వ తేదీ నుంచి రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ జరుగుతోంది. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 77.12 శాతం ఎన్యూమరేషన్? పూర్తయినట్లు ఈసీ తెలిపింది. హైదరాబాద్ నగరంలో 56.31 శాతం, రంగారెడ్డి జిల్లాలో 63.43 శాతం ఎన్యూమరేషన్ పూర్తయినట్లుగా ఎన్నికల సంఘం వెల్లడించింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 61.37శాతం - మిగతా3లో




## ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో తగ్గనున్న వర్షాలు

- దక్షిణాదిలో 125 ఏళ్లలో లేనంతగా పెరిగిన రాత్రి ఉష్ణోగ్రతలు!
- దేశంలో మలిదశ రుతుపవన వర్షాలు సాధారణం కంటే తక్కువే
- వాతావరణ శాఖ అంచనా
- "ఆగస్టు-సెప్టెంబర్ కాలంలో దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు

## రాష్ట్రంలో ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ ప్రక్రియ షురూ

- రాష్ట్రంలో ప్రారంభమైన ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ ప్రక్రియ
- తహశీల్దార్, మీ సేవా కేంద్రాల్లో ఫ్యామిలీ సర్టిఫికెట్ ఇస్తారన్న ఉపముఖ్యమంత్రి భట్టి
- కుటుంబ సమాచారం, సభ్యుల వివరాలతో సర్టిఫికెట్ జారీ
- భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమల్లో ఫ్యామిలీ రిజిస్టర్ కీలకంగా మారే అవకాశం



హైదరాబాద్

రాష్ట్రంలో ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ ప్రక్రియ ప్రారంభమైందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. తహశీల్దార్, మీ సేవా కేంద్రాల్లో ఫ్యామిలీ ధ్రువపత్రాలు ఇస్తారని ఆయన తెలిపారు. కుటుంబ సమాచారం, సభ్యుల వివరాలతో సర్టిఫికెట్ జారీ చేస్తారని వెల్లడించారు. ఫ్యామిలీ సర్టిఫికేట్ అన్ని చోట్ల చెల్లుతుందని ఆయన స్పష్టం చేశారు. ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ కోసం రేషన్‌కార్డుల్లోని సమాచారాన్ని ప్రామాణికంగా తీసుకోనున్నారు. పౌర సరఫరాలశాఖ డేటాను రెవెన్యూశాఖ తీసుకోనుంది. ఫ్యామిలీ రిజిస్టర్ డిజిటల్ రూపంలో ఉంటుంది. ప్రతీ కుటుంబానికి గుర్తింపు కార్డును ఇస్తారు. రేషన్ కార్డు నంబరునే ఫ్యామిలీ రిజిస్టర్ ఐడెంటిఫికేషన్ నంబర్ (ఫ్రిన్)?గా ఇవ్వాలని యోచిస్తున్నారు. రిజిస్టర్‌లో ప్రతి కుటుంబానికి రిజిస్టర్ ఐడెంటిఫికేషన్ నెంబరు, కుటుంబ యజమాని, - మిగతా3లో



## పీఎం కిసాన్ పథకం మరో ఐదేళ్లు పొడిగింపు

- రూ.4.51లక్షల కోట్ల ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం
- పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి రూ.3.15 లక్షల కోట్లు కేటాయింపు
- ఖేలో ఇండియా, జాతీయ క్రీడా ఫెడరేషన్ పథకానికి రూ.36,441 కోట్లు
- 'పీఎం కిసాన్' పథకం ద్వారా ఇప్పటివరకు 23 విడతల్లో మొత్తం 4.47 లక్షల కోట్లకు పైగా ఆర్థిక సహాయం

# సరికొత్త శిఖరాలకు భారత్- యూకే వ్యూహాత్మక భాగస్వామ్యం

భారత్, బ్రిటన్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. బ్రిటన్ నూతన ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆండీ బర్న్‌హామ్‌తో భారత ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ఫోన్?లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య ఇటీవల అమల్లోకి వచ్చిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం ద్వారా లభించే వాణిజ్య, పెట్టుబడి అవకాశాలను సంపూర్ణంగా ఉపయోగించుకోవాలని ఇరువురు నేతలు నిశ్చయించారు. భారత్- యూకే సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లేందుకు ఇరు దేశాల ప్రధానులు అంగీకరించారు. ఇందులో భాగంగా పలు కీలక రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత విస్తరించుకోవాలని నిర్ణయించారు ఇరు దేశాల మధ్య ఈ నెలలోనే అమల్లోకి వచ్చిన చారిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం వ్యాపారాలు, కార్మికులు, వినియోగదారులకు కొత్త అవకాశాలను సృష్టిస్తుందని బ్రిటన్ ప్రధాని బర్న్‌హామ్ అన్నారు. ఈ ఒప్పందం ద్వారా లభించే వాణిజ్య, పెట్టుబడి ప్రయోజనాలను ఉమ్మడి శ్రేయస్సు కోసం పూర్తిగా వాడుకుంటామని మోదీ స్పష్టం చేశారు. అహ్మదాబాద్ టూ మాంచెస్టర్ 'విజన్ 2035' యూకే ప్రభుత్వ అధికారిక ప్రకటన ప్రకారం, ఈ సంభాషణలో ఆండీ బర్న్‌హామ్ బ్రిటన్‌లోని భారతీయ సమాజం అందిస్తున్న సహకారాన్ని ప్రశంసించారు. ఈ క్రమంలో స్పందించిన ప్రధాని మోదీ, బర్న్‌హామ్ స్వస్థలమైన మాంచెస్టర్, గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరాల మధ్య ఉన్న చారిత్రక పోలికను గుర్తు చేశారు. అహ్మదాబాద్‌ను మాంచెస్టర్ ఆఫ్ ఇండియాగా అభివర్ణించారు.





'యూకే- ఇండియా విజన్ 2035' ఫ్రేమ్‌వర్క్ ద్వారా ద్వైపాక్షిక సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్తామని బ్రిటన్ ప్రధాని బర్న్‌హమ్ అన్నారు. 'యూకే- ఇండియా టెక్నాలజీ సెక్యూరిటీ ఇనిషియేటివ్'కు తన పూర్తి మద్దతు ఉంటుందని బ్రిటన్ ప్రధాని ప్రకటించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అత్యాధునిక సాంకేతికతలపై ఇరు దేశాలు కలిసి పనిచేయనున్నాయని అన్నారు. ఈ క్రమంలోనే పశ్చిమాసియాలో మారుతున్న పరిస్థితులపై ఇరు నేతలు చర్చించారు. అక్కడ ఉద్రిక్తతలను తగ్గించడానికి 'స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్' జలసంధిని తిరిగి ప్రారంభించడానికి కలిసికట్టుగా దౌత్యపరమైన కృషి చేయాలని అంగీకారానికి వచ్చారు.

**బ్రిటన్ ప్రధానికి మోదీ అభినందనలు**

మరోవైపు బ్రిటన్ నూతన ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన ఆండీ బర్న్‌హామ్‌కు ప్రధాని మోదీ మరోసారి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ క్రమంలోనే ఆయన పదవీకాలం విజయవంతం కావాలని మోదీ ఆకాంక్షించారు. ఈ మేరకు ప్రధానమంత్రి మోదీ ఎక్స్?లో పోస్ట్ చేశారు. బ్రిటన్ ప్రధానితో మాట్లాడటం చాలా ఆనందాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు.

# పీఎం కిసాన్ పథకం మరో ఐదేళ్లు పొడిగింపు

దేశ సమగ్ర అభివృద్ధి, సంక్షేమానికి ఉద్దేశించిన పలు కీలక ప్రతిపాదనలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన దాదాపు రూ.4.51 లక్షల కోట్ల భారీ వ్యయంతో కూడిన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలకు కేంద్ర మంత్రిమండలి పచ్చజెండా ఊపింది. దేశంలోని రైతులకు నిరంతర ఆర్థిక భరోసా కల్పించే పీఎం-కిసాన్ పథకాన్ని 2030-31 ఆర్థిక సంవత్సరం వరకు మరో ఐదేళ్ల పాటు పొడిగించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందుకోసం రూ.3,15,614 కోట్ల నిధులను కేటాయించినట్లు కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.

**రైతు కుటుంబాలకు ఆర్థిక సహాయం**

2019 ఫిబ్రవరి 24న ప్రారంభమైన ఈ కేంద్ర ప్రాయోజిత పథకం కింద అర్హత కలిగిన ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి రూ.6000 ఆర్థిక సహాయం అందుతోంది. ఈ నిధులను నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోకి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ విధానంలో ప్రతి నాలుగు నెలలకొకసారి రూ.2000 చొప్పున మొత్తం జమ చేస్తున్నారు. 'పీఎం కిసాన్' పథకం ద్వారా ఇప్పటివరకు 23 విడతల్లో మొత్తం 4.47 లక్షల కోట్లకు పైగా ఆర్థిక సాయాన్ని అందించింది. ఈ పథకం అమలుపై నీతి ఆయోగ్ జరిపిన అధ్యయనంలో ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. దాదాపు 92 శాతం మంది లబ్ధిదారులు ఈ నగదును నేరుగా వ్యవసాయ పెట్టుబడుల కోసమే వినియోగిస్తున్నారని, తద్వారా 85 శాతం



మంది రైతుల వ్యవసాయ ఆదాయం మెరుగుపడటమే కాకుండా అప్పుల కోసం ఇతరులపై ఆధారపడటం కూడా తగ్గిందని నివేదిక స్పష్టం చేసింది.

**ఇంధన రంగాన్ని ప్రోత్సహించేందుకు 'సూర్య సరోవర్ యోజన'**

పునరుత్పాదక ఇంధన రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు రూ.5,070 కోట్లతో 'ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజన'కు కేబినెట్ ఆమోదం తెలిపింది. జలాశయాలు, పారిశ్రామిక చెరువులపై సోలార్ ప్లాంట్ల నిర్మాణమే లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందించారు. ప్రస్తుతం ఉన్న 700 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ సామర్థ్యాన్ని 5,000 మెగావాట్లకు పెంచనున్నారు. 10,000 మెగావాట్ల సామర్థ్యంతో ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్‌లను అందుబాటులోకి తీసుకురానున్నారు. 2026-27 నుంచి 2030-31 వరకు ప్రాజెక్టులను అమలులోకి తీసుకురానుండగా, 2032-33 వరకు కేంద్రం ఆర్థిక సహకారం అందించనుంది. ప్రాజెక్టు సాధ్యాసాధ్యాల అధ్యయనానికి ఒక్కో ప్రాజెక్టుకు 50 లక్షల వరకు, అలాగే నిర్మాణ దశలో ప్రతి మెగావాట్‌కు కోటి చొప్పున కేంద్రం ఆర్థిక సహాయం చేయనుంది. ఈ పథకం ద్వారా ఏటా సుమారు కోటి టన్నుల కర్బన ఉద్గారాలు తగ్గనున్నాయి. దాదాపు 16,000 నుంచి 17,000 మందికి ప్రత్యక్ష ఉపాధి లభించడమే కాకుండా దేశీయ సోలార్, బ్యాటరీ తయారీ రంగానికి భారీ ఊతం లభించనుంది.

సముద్ర వనరుల పరిశోధన, వినియోగం దిశగా చేపడుతున్న రూ.84,084 కోట్ల విలువైన 'సముద్ర మంథన్' ప్రాజెక్టును కేంద్ర కేబినెట్ ఆమోదించింది. క్రీడారంగాన్ని ప్రోత్సహించడానికి ఖేలో ఇండియా, జాతీయ క్రీడా ఫెడరేషన్ పథకానికి రూ.36, 441 కోట్లు మంజూరు చేశారు. రవాణా మౌలిక సదుపాయాలను మెరుగుపరచేందుకు ట్విన్ ట్యూబ్ సొరంగాల నిర్మాణాలకు గాను రూ.9,779 కోట్లు కేటాయిస్తూ కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. కాగా, పీఎం కిసాన్? పథకం పొడిగింపు వల్ల వ్యవసాయంలో పెట్టుబడులు పెట్టే రైతులకు మేలు జరుగుతుందని ప్రభుత్వం అభిప్రాయపడింది. అలాగే, ఉత్పాదకత మెరుగుపడుతుందని, వ్యవసాయ సంబంధిత నష్టాలను తగ్గించడంలో, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో ఇది సహాయపడుతుందని తెలిపింది. ఈ పథకం ద్వారా, అర్హులైన రైతు కుటుంబాలకు 'డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్' (ఐడీ) విధానం ద్వారా సకాలంలో నిధులు అందుతాయని పేర్కొంది.

# "కొంచెమైనా సిగ్గు మిగిలి ఉంటే- అమిత్ షాతో రాజీనామా చేయించండి"

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో విద్యార్థులపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తూ, వారిని బలవంతంగా నిర్బంధిస్తూ, మోదీ సర్కార్ విద్యార్థులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. దీనికి కారణమైన కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేత రాజీనామా చేయించాలని ఆయన ప్రధాని మోదీని డిమాండ్ చేశారు. తమపై ఎలాంటి చర్యలు తీసుకోకూడదనే నిబంధనపైనే యువత తమ ఆందోళనను విరమించుకున్నారని, కానీ ఇప్పుడు మోదీ సర్కార్ తన మాట తప్పిందని ఖర్గే విమర్శించారు.

జులై 20న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతృత్వంలో విద్యార్థులు, నిరసనకారులు సంసద్ ఛలో మార్చ్ చేశారు. అప్పుడు నిరసనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణ చెలరేగింది. దీంతో వారిని చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీ ఛార్జ్ చేశారు. బాష్పవాయువు ప్రయోగించారు. దీనితో ఇరువైపులా చాలా మందికి గాయాలయ్యాయి. దీనిని ఖర్గే ప్రస్తావిస్తూ, ఎక్స్ వేదికగా ప్రధాని మోదీపై విరుచుకుపడ్డారు. "నరేంద్ర మోదీ, 10 రోజుల క్రితం మీ ప్రభుత్వం లాఠీలు, బెత్తాలు, పెల్లెట్ గన్?లను ఉపయోగించి యువతపై విరుచుకుపడింది. ఇప్పుడు విద్యార్థులు తమ నిరసనలు విరమించుకున్నారు. అయినా మీరు వారిపై ఎఫ్?ఐఆర్?లు నమోదు చేస్తూ, బలవంతంగా నిర్బంధిస్తూ కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నారు. వాస్తవానికి తమపై ఎలాంటి చర్యలు తీసుకోరనే షరతుపైనే యువత ఉద్యమాన్ని విరమించారు. కానీ మీ ప్రభుత్వాలు ఇచ్చిన మాటను తప్పాయి. యువతకు చెందిన సోషల్ మీడియా ఖాతాలను బ్లాక్ చేస్తున్నారు. యువతుల వ్యక్తిగత వివరాలను ఇంటర్నెట్?లో లీక్ చేస్తూ వేధిస్తున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా కనీసం పార్లమెంట్?లో అడుగు పెట్టలేదు. జవాబుదారీతనం లేకుండా ప్రవర్తిస్తున్నారు. ఇదంతా వారి అహంకారాన్ని సూచిస్తోంది. తప్పులను కప్పిపుచ్చుకోవడానికి, మీ ఇమేజ్?ను కాపాడుకోవడానికి చేసే ఇలాంటి తంత్రాలు ఇకపై సాగవు. యువత మీ నిజస్వరూపాన్ని చూశారు. కొంచెమైనా సిగ్గు మిగిలి ఉంటే, వెంటనే అమిత్? షా చేత



రాజీనామా చేయించండి."

**మోదీ రీల్స్ చేయడంలో బీజీగా ఉన్నారు!**

మరోవైపు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్? ప్రధాని మోదీపై తనదైన రీతిలో సెటైర్లు వేశారు. "ఓ వైపు ప్రధాని మోదీ రీల్స్ చేయడంలో బిజీగా ఉంటే, మరోవైపు పేపర్ లీక్ అయ్యింది" అని ఎద్దేవా చేశారు.

"ప్రధాని మోదీ రీల్స్-మేకింగ్ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడంలో నిరంతరం బిజీగా ఉన్నారు. మోదీ ప్రభుత్వం ఫాస్ట్? ట్రాక్ కోర్టులకు సంబంధించిన కండితుడుపు చట్టాన్ని పార్లమెంట్?లో ఆమోదించింది. ఈ తరుణంలోనే దేశంలో మరో పేపర్ లీక్ వార్త వెలుగులోకి వచ్చింది. ఈసారి మాజీ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్వరాష్ట్రమైన ఒడిశాలో ఈ ఘటన జరిగింది. జులై 27న ఒడిశా యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్?కి చెందన పీజీ పరీక్ష జరుగుతుండగానే, దానికి సంబంధించిన ప్రశ్నాపత్రం వాట్సాప్?లో సర్క్యులేట్ అయినట్లు తేలింది. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ తన స్థిరమైన వైఖరిని స్పష్టం చేసింది. 2024లో అయినా లేదా ఇప్పుడు 2026లో అయినా కాంగ్రెస్ వాదన ఒక్కటే. కేవలం పేపర్ లీకేజీలకు కఠినమైన శిక్షలను చట్టబద్ధం చేయడం, కోర్టులను ఫాస్ట్? ట్రాక్? కోర్టులుగా ప్రకటించడం ఇక ఎంత మాత్రం సరిపోదు. మన విద్యావ్యవస్థలో పేరుకుపోయిన వ్యాపార ధోరణి, అవినీతిపై మనం మరింత విస్తృతమైన, నిజాయితీతో కూడిన చర్చ జరపాల్సిన అవసరం ఉంది. దేశంలో జరిగిన విద్యార్థి ఉద్యమం అసలు ఆశయం కూడా ఇదే. మోదీ ప్రభుత్వం ఈ ఆశయాన్ని కచ్చితంగా గౌరవించాలి" అని జైరాం రమేశ్ అన్నారు.

## పీవోకేలో పాకిస్థాన్ దమనకాండపై భారత్ సీరియస్

పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో పాక్ సాగిస్తున్న దారుణాలపై విదేశాంగ శాఖ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. పీవోకేలో జరుగుతున్న దారుణాలపై అంతర్జాతీయ సమాజం దృష్టి సారించి, పాకిస్థాన్‌ను జవాబుదారీ చేయాలని భారత్ డిమాండ్ చేసింది. పీవోకేలో శాంతియుతంగా జరుగుతున్న ఆందోళనలపై పాకిస్థాన్ ఉక్కుపాదం మోపుతోందని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ ఆరోపించారు. పాక్ సైన్యం అణిచివేత చర్యల కారణంగా పీవోకేలో ఇప్పటికే 40మందికిపైగా అమాయకులు ప్రాణాలు కోల్పోయారని, ఎంతోమంది తీవ్రంగా గాయపడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆందోళన చేస్తున్న పౌరులను పాక్ రక్షణ మంత్రి 'శత్రువులు'గా ముద్రవేయడం, అమాయక ప్రజలపై పాక్ యంత్రాంగానికి ఎంత చిన్నచూపు ఉందో బట్టబయలైందని రణధీర్ జైశ్వాల్ విమర్శించారు. పాకిస్థాన్ యంత్రాంగం ద్వారా శిక్షణ, నిధులు, ఆయుధాలు పొందిన ముజాహిద్దీన్లు ఇప్పుడు తమకే ఎదురుతిరుగుతున్నారని పాక్ ప్రధాని రాజకీయ వ్యవహారాల ప్రత్యేక సహాయకుడు అంగీకరించారని ఆయన చెప్పారు. "మీరు, మనమందరం చూసినట్లుగా పాకిస్థానీ ప్రభుత్వం పీఓకేలో శాంతియుత పౌరులపై క్రూరమైన బలప్రయోగాన్ని కొనసాగిస్తోంది. ఈ అణచివేత కారణంగా 40 మందికి పైగా అమాయక ప్రజలు మరణించారు. ఇంకా చాలా మంది తీవ్రంగా గాయపడ్డారు. నిరసన చేస్తున్న పౌరులను పాక్? రక్షణ మంత్రి శత్రువులుగా ముద్ర వేసినప్పుడు, పీఓకేలోని అమాయక ప్రజల పట్ల ప్రభుత్వానికి ఉన్న సంపూర్ణ ధిక్కారం బట్టబయలైంది." అని జైస్వాల్ అన్నారు.

పీఓకేలో నిర్వహిస్తున్న ఎన్నికలు పాకిస్థాన్ ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించడాన్ని ప్రతిబింబిస్తున్నాయని వీజూా ప్రతినిధి రణ్?ధీర్ జైస్వాల్? అన్నారు. అణచివేతను ఎదుర్కొంటున్న వారు ఈ హింసపై స్వతంత్ర అంతర్జాతీయ విచారణ కోరారని గుర్తు చేశారు. "అక్కడ నిర్వహించే ఎన్నికలు పాకిస్థాన్ ప్రభుత్వానికి అవమానకరమైన తిరస్కారంగా నిలుస్తున్నాయి. హింసాత్మక పాలనను ఎదుర్కొంటున్న ప్రజలు, అంతర్జాతీయ సంస్థలను విచారణ కోసం అభ్యర్థించారు. ఈ చట్టవిరుద్ధమైన హత్యలపై స్వతంత్ర దర్యాప్తు జరగాలి. పాకిస్థాన్ చర్యలను అంతర్జాతీయ సమాజం నిశితంగా పరిశీలించి, దాని దురాగతాలకు జవాబుదారీగా నిలబెట్టాలని మేము కోరాము." అని ఆయన అన్నారు.

పాకిస్థాన్ ప్రభుత్వం ప్రేరేపిత ఉగ్రవాదంపై అక్కడి ప్రధానమంత్రి రాజకీయ వ్యవహారాల ప్రత్యేక సహాయకుడు రాణా సనావుల్లా ఇటీవల చేసిన వ్యాఖ్యలపైనా రణ్?ధీర్? జైస్వాల్? స్పందించారు. భారత్‌ను దెబ్బతీసేందుకు పాక్ గతంలో ముజాహిదీన్లకు శిక్షణ ఇచ్చి, ఆయుధాలు సమకూర్చిందని జైస్వాల్ అన్నారు. వారే ఇప్పుడు తమ తుపాకులను సొంత దేశంపై గురిపెట్టారని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆయుధాలు చేపట్టారని ఆయన పేర్కొన్నారు. హింస పేట్రేగిపోవడంతో అంతర్జాతీయ సంస్థలు స్వతంత్ర దర్యాప్తు చేయాలని అక్కడి ప్రజలే కోరుకుంటున్నారని చెప్పారు. "పాకిస్థాన్ ప్రభుత్వం శిక్షణ ఇచ్చి, నిధులు సమకూర్చి, ఆయుధాలు ఇచ్చి భారతదేశానికి పంపిన ముజాహిదీన్‌లే ఇప్పుడు తమ తుపాకులను దేశం వైపే తిప్పుకుని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మారారు. ఈ విషయాన్ని పాక్? ప్రధానమంత్రి రాజకీయ వ్యవహారాల ప్రత్యేక సహాయకుడు బహిరంగంగానే అంగీకరించారు." అని వీజూా ప్రతినిధి అన్నారు. అంతకుముందు జియో న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన సనావుల్లా, పీఓకేలోని నిరసనకారులు ఒకప్పుడు తాము ముజాహిదీన్‌లుగా శిక్షణ ఇచ్చిన వారేనని అన్నారు. వారిని పోరాడటానికి పంపామని, కానీ ఈ రోజు వారు మా మెడలకు చుట్టుకున్నారని అంగీకరించారు.

పాకిస్థాన్? ఆక్రమిత కశ్మీర్?లోని ప్రజలు విస్తృతమైన ఎన్నికల అవకతవకలపై ఫిర్యాదు చేస్తున్నారు. రిగ్గింగ్, రాజకీయ జోక్యం, ప్రజాస్వామ్య హక్కులను క్రమపద్ధతిలో అణచివేస్తున్నారని ఆరోపిస్తున్నారు. పాక్ ఆక్రమిత జమ్మూ కాశ్మీర్‌లో క్షీణిస్తున్న మానవ హక్కుల పరిస్థితిపై ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ సమాజం తక్షణమే జోక్యం చేసుకోవాలని యునైటెడ్ కాశ్మీర్ పీపుల్స్ నేషనల్ పార్టీ (ఖఖూచీూ) కూడా పిలుపునిచ్చింది. యూరోపియన్ యూనియన్, యునైటెడ్ కింగ్‌డమ్, యునైటెడ్ స్టేట్స్, కెనడా, జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, స్విట్జర్లాండ్, స్వీడన్, నార్వే, రష్యా, చైనా, అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు, ప్రపంచ మీడియాకు ఖఖూచీూ విజ్ఞప్తి చేసింది. జీవన వ్యయాలు పెరగడం, పరిపాలనపరమైన సమస్యలు, మైనార్టీలపై రాజకీయ వివక్ష తదితర అంశాలకు నిరసనగా గత నెల నుంచి పీవోకేలో ఆందోళనలు మిన్నంటుతున్న సంగతి తెలిసిదే. ది జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) దీనికి నాయకత్వం వహిస్తోంది.

## ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో తగ్గనున్న వర్షాలు



రైతులు పంటలు వేసే వేళ భారత వాతావరణ శాఖ (ఐఎండీ) శుక్రవారం తన నెలవారీ అంచనాలు వెల్లడించింది. మలిదశ రుతుపవన వర్షాలు సాధారణంగా కంటే తక్కువగా కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అంటే ఆగస్టు, సెప్టెంబర్? వరకు సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదువుతుందని అంచనా వేసింది. ఆగస్టు-సెప్టెంబర్ కాలంలో దేశవ్యాప్త వర్షపాతం దీర్ఘకాలిక సగటు (ఎల్పీఏ)లో 94 శాతం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉంది. ఒక నిర్దిష్ట ప్రాంతంలో ఒక నెల లేదా సీజన్‌లో నమోదైన వర్షపాతాన్ని, సాధారణంగా 30 నుంచి 50 సంవత్సరాల సుదీర్ఘ కాలానికి సగటుగా లెక్కించడాన్ని ఎల్‌పీఏ అంటారు. 1971 నుంచి 2020 వరకు చారిత్రక డేటా ప్రకారం, ఆగస్టు-సెప్టెంబర్ కాలానికి దేశవ్యాప్త సగటు వర్షపాతం (ఎల్?పీఏ) 422.8 మి.మీ.గా ఉంది.

**ప్రాంతాలవారీగా ప్రభావం ఎలా ఉంటుందంటే?**

వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మృత్యుంజయ్ మహాపాత్ర మాట్లాడుతూ, "ఆగస్టు-సెప్టెంబర్ కాలంలో దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు అవుతుంది. అయితే దక్షిణ భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు, మధ్య భారతదేశం, వాయువ్య భారతదేశంలోని ఉత్తర ప్రాంతాలు, తూర్పు, ఈశాన్య భారతదేశాల్లో మాత్రం సాధారణం నుంచి సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉంది" అని తెలిపారు.

అయితే, దేశవ్యాప్తంగా ఆగస్టు నెలలో కూడా వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉంటుందని ఐఎండీ అంచనా వేసింది. 1971-2020 గణాంకాల ప్రకారం, ఆగస్టు నెలలో దేశంలో వర్షపాతం ూూ 254.9 మి.మీ.గా ఉంది. ప్రస్తుతం, జూన్, జులై నెలల మధ్య కాలానికి సంబంధించి 13 శాతం లోటు వర్షపాతం నమోదైంది. జూన్ నెలాఖరు నాటికి ఈ లోటు 35.4 శాతంగా ఉండేది. అయితే, జులైలో మంచి వర్షపాతం నమోదవ్వడం కారణంగా ఈ వర్షపాత లోటు తగ్గిందని డాక్టర్ మహాపాత్ర తెలిపారు. "జులై నెల సాధారణ సగటు వర్షపాతం 280.5 మి.మీ కాగా, ఈ ఏడాది దేశంలో 283.3 మి.మీ వర్షపాతం నమోదైంది. అయితే, దీనికి ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయి. బంగాళాఖాతంలో నాలుగు అల్పపీడన వ్యవస్థలు ఏర్పడ్డాయి. వాటిలో రెండు తీవ్రతరం చెంది వాయుగుండాలుగా మారాయి" అని ఆయన పేర్కొన్నారు. జులై మొదటి వారంలో గాలి, మేఘాల కదలికల వ్యవస్థ (వీజీూ) భారతదేశానికి అనుకూలమైన దశలో ఉండటం వల్ల దక్షిణ భారతం మీదుగా రుతుపవన మేఘాలు ఉత్తరం వైపు విస్తరించి భారీ వర్షాలు పడ్డాయి. అయితే జులై చివరి భాగంలో ఇది ప్రతికూలంగా మారింది. కాగా, భారత వాతావరణ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, గత ఐదేళ్లలో అత్యధిక సంఖ్యలో 'అత్యంత భారీ వర్షపాత' సంఘటనలు (204.5 మి.మీ కంటే ఎక్కువ వర్షపాతం) కూడా ఈ జులైలోనే నమోదయ్యాయి. ఇవి ప్రధానంగా ఒడిశా, గుజరాత్, మహారాష్ట్రల్లో కేంద్రీకృతమై ఉన్నాయని డాక్టర్ మహాపాత్ర పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా చూస్తే ఈ ఏడాది జులైలో సాధారణం కంటే కొంచెం ఎక్కువ వర్షపాతం నమోదైనప్పటికీ, దక్షిణ ద్వీపకల్ప ప్రాంతంలో మాత్రం 1901 తర్వాత లోటు వర్షపాతం నమోదైంది.


**ఆ రాష్ట్రాల్లో భారీ వర్షాలు**

ఇదిలా ఉండగా, కేరళ, అసోం, అరుణాచల్ ప్రదేశ్, ఇతర ఈశాన్య రాష్ట్రాలతో సహా దేశంలోని పలు ప్రాంతాలకు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. రానున్న రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఉరుములతో కూడిన వర్షాలు, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. రుతుపవన కాలంలో పలు రాష్ట్రాలు వరదలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదాలతో సతమతమవుతున్న తరుణంలో ఈ తాజా హెచ్చరికలు వెలువడ్డాయి.

# మరోసారి ఎల్ఆర్ఎస్ గడువు పెంపు

-మొదటిపేజీ తరువాయి

చేసుకున్నారు. వారిలో ఫీజు చెల్లించి క్రమబద్ధీకరించుకోవచ్చునని లేఖలు 20 లక్షల 493 మందికి పంపించారు. రాయితీ గడువు పలుమార్లు పొడిగించినప్పటికీ దరఖాస్తుదారుల నుంచి అంతంత మాత్రమే స్పందన వస్తోంది. ఎల్ఆర్ఎస్ దరఖాస్తు రిజెక్టైతే 10 శాతం ప్రాసెసింగ్ ఛార్జీలు మినహా మిగతా 90 శాతం తిరిగి చెల్లించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఇవాల్టితో గడువు ముగియడంతో ఎస్ఐఆర్ ప్రక్రియ, వర్షాలు తదితర కారణాల వల్ల పొడిగించాలని క్యూర్ పరిధిలోని కార్పొరేషన్ల కమిషనర్లు ప్రభుత్వాన్ని కోరారు.



### ఈ నేపథ్యంలో మరోసారి పొడిగింపు

గత ప్రభుత్వ హయాంలోనే ఎల్ఆర్ఎస్ పథకం ప్రకటించారు. అయితే దీనికోసం రాష్ట్రవ్యాప్తంగా 25.70 లక్షల మంది దరఖాస్తులు చేసుకున్న సంగతి తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత సంవత్సరం మార్చిలో అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు తొలుత 50% ఆ తర్వాత 25% రాయితీ ప్రకటించారు. అప్పటికే దరఖాస్తులు చేసుకున్న వారు తాము చెల్లించాల్సిన ఫీజులో 25% మినహాయించుకొని మిగతాది చెల్లిస్తే అనుమతులిస్తారు. ఈ రాయితీ గడువును పెంచుకుంటూ వస్తున్నారు. సర్ వల్ల ఎల్ఆర్ఎస్‌పై దృష్టి పెట్టలేకపోయామని, దీన్ని మరోమారు పొడిగించాలని పలువురు అధికారులు ప్రభుత్వాన్ని కోరినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మరోసారి పొడిగింపు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

### 25 శాతం రాయితీతో ఒటీఎస్?

తెలంగాణలో అనధికార స్థలాల క్రమబద్ధీకరణను వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం రాయితీతో ఒటీఎస్?(వన్? టైమ్? సెటిల్?మెంట్)ను ప్రకటించిన సంగతి తెలిసిందే. నిజానికి గత బీఆర్?ఎస్ ప్రభుత్వం హయాంలోనే ఎల్?ఆర్?ఎస్? పథకం ప్రారంభమైంది. పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించే ఉద్దేశంతో ప్రభుత్వం గత సంవత్సరం ఫిబ్రవరిలో 25 శాతం రాయితీతో ఓటీఎస్‌ను ప్రకటించింది.

### దరఖాస్తును తిరస్కరిస్తే ఇలా

లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం(ఎల్ఆర్ఎస్)లో భాగంగా దరఖాస్తును తిరస్కరిస్తే ఆ తేదీ నుంచి వారం రోజులలోగా అప్పిలేట్ కమిటీకి అప్లై చేయవచ్చని టౌన్ ప్లానింగ్ విభాగం వెల్లడించింది. దరఖాస్తుదారు తన అప్లికేషన్ ఏ స్థాయిలో ఉందో తెలుసుకొనేందుకు అధికారిక వెబ్‌సైట్ https://lrs.telangana.gov.in/layouts/0revU5XZO4JF లింకును ఓపెన్ చేసి పరిశీలించవచ్చు. ఇందులో అడిగినట్లుగా దరఖాస్తు నంబరు టైప్ చేస్తే పూర్తి వివరాలు మనకు కనిపిస్తాయి.

### పూర్తి ఫీజు చెల్లించాల్సిందే

అనధికార లేఅవుట్లలో అంటే 2020 ఆగస్టు 26కు ముందు రిజిస్ట్రేషన్ అయిన స్థలాలకు ఎల్ఆర్ఎస్ కింద ఫీజు చెల్లించి రెగ్యులరైజ్? చేసుకోవాలి. ఒక వ్యక్తి 300 గజాలకు ఆ సమయంలో రుసుం చెల్లించి ఆ తరవాత అందులో కొంత అమ్మినా సరే ఇప్పుడు మొత్తం 300 గజాలకు పూర్తి ఫీజు కట్టాల్సి వస్తోంది. నాడు రుసుం కట్టిన తరవాత కొంత అమ్మేశానని, అమ్మిన దానికి పూర్తి ఫీజు ఇప్పుడు చెల్లిస్తామంటే మాత్రం పని జరగదు.

# వర్షాలు, వరదలతో పలు చోట్ల నిలిచిన రాకపోకలు, నీటమునిగిన పంట పొలాలు

ఉత్తర తెలంగాణలో మూడోరోజు వర్షాలు కాస్త తగ్గుముఖం పట్టడంతో వరదల తీవ్రత తగ్గింది. కానీ ఎగువ నుంచి గోదావరికి వస్తున్న వరదతో పలు చోట్ల రాకపోకలు నిలిచిపోగా వరి, పత్తి, సోయా పంటలు నీట మునిగాయి. సింగరేణి బొగ్గుగనుల్లో వర్షపు నీరు నిలిచి ఉత్పత్తి ఆగిపోయింది. ఎల్?నినో ప్రభావంతో వెలవెల బోయిన గోదావరి పరివాహక ప్రాంతం రెండ్రోజులుగా కురిసిన వర్షంతో జలకళను సంతరించుకుంది.



### పంట చేలలోకి వరద

రెండ్రోజులుగా కురిసిన వర్షాలతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రవహిస్తున్న నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. జిల్లాలోని భీంపూర్ మండలం గుబిడి గుండా ప్రవేశించే పెన్ గంగ నది ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం తుమ్మిడిహెటి వద్ద ప్రాణహిత నదికి వరదనీరు వచ్చి చేరుతోంది. పరివాహక ప్రాంతాలైన భీంపూర్, జైనథ్, బేలా మండలాల్లో పంట చేలలోకి వరద చేరి పత్తి, సోయా వంటి పంటలు నీట మునిగాయి. నిర్మల్ జిల్లా బాసర వద్ద గోదావరి జోరందుకుంది. సింగరేణి ఉపరితల గనుల్లో బొగ్గు ఉత్పత్తి పూర్తిగా స్తంభించింది.

మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాలో పలు గనుల్లోకి వరద నీరు చేరడంతో ఉత్పత్తికి అంతరాయం కలిగింది. వరద నీరు కాలువలుగా మారడంతో భారీ వాహనాలు ఉపరితలంలోనే నిలిచిపోయాయి. పెద్దపల్లి జిల్లా కన్నాల పరిసరాల్లోని బొగ్గుబావి నుంచి మట్టి దిగువనున్న పంట పొలాల్లో చేరుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇదే విధంగా ప్రతీ ఏడాది మట్టి కొట్టుకొచ్చి పంటలు నాశనం అవుతున్నాయని రైతులు వాపోయారు.

### నిండుకుండలా చెరువులు, కుంటలు

నిజామాబాద్ జిల్లాకు ముసురు పట్టింది. డిచ్‌పల్లి, సిరికొండ, ధర్పల్లి, మోపాల్, జక్రాన్ పల్లి, ఇందల్వాయి మండలాల్లో వర్షం పడుతుంది. ఇప్పటికే కురిసిన భారీ వర్షాలకు వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు, కుంటలు నిండుకుండను తలపిస్తున్నాయి. డిచ్‌పల్లి మండలంలోని బర్దిపూర్ కోణంచెరువు అలుగు పారుతోంది. ధర్పల్లి మండలంలోని వాడి, ముత్యాలమ్మ వాగులకు వరద భారీగా వస్తుంది. బోధన్ నియోజకవర్గంలోని కందకుర్తి త్రివేణి సంగమం వద్ద గోదావరి పరవళ్లు తొక్కుతుంది. నదిలోని శివాలయం నీటమునిగింది.

### పెద్ద చెరువుకు గండి

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి తాగునీటికి ఆధారమైన పెద్ద చెరువు నుంచి నీరు వెళ్లిపోవడంతో పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చెరువు మత్తడి పక్కన గట్టును కొద్దివరకు తొలగించడంతో చెరువులో ఉండాల్సిన నీరంతా పొంగిపొర్లి వాగులో కలిసిపోతోంది. చెరువులోని చేపలు సైతం బయటకు కొట్టుకుపోయాయి. పురపాలక, నీటిపారుదల అధికారుల మధ్య సమన్వయ లోపంతోనే చెరువు ఖాళీ అవుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### కూలిన పాఠశాల

వర్షాలకు సంగారెడ్డి మండలం కల్పగూర్?లోని ఉన్నత పాఠశాలలోని రికార్డు గదిలో రేకులు కూలాయి. ఉదయం 9 గంటల ప్రాంతంలో ఘటన జరిగింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. శిథిలావస్థలో ఉన్న గదుల మరమ్మతులు చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

### డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేయట్లేదు

ములుగు జిల్లా వాజేడులోని పలు ఇళ్లలోకి గోదావరి వరద భారీగా చేరింది. అధికారులు బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు చర్యలు చేపట్టగా పలువురు స్థానికులు నిరాకరించారు. ప్రతి ఏటా వరదల సమయంలో వేరే ప్రాంతాలకు తరలించడం తప్ప తమకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేయట్లేదని బాధితులు వాపోయారు.

### వరదలో చిక్కుకున్న వారిని బయటకు చేర్చి

కొత్తగూడెం జిల్లా చర్ల వద్ద ఇసుక ర్యాంపులో చిక్కుకున్న 50మంది వ్యక్తులను అధికారుల సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఇసుక కోసం వెళ్లగా ఒక్కసారిగా వరద పోటెత్తడంతో ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతోనే గోదావరి తీరంలోనే మిషన్ ఆపరేటర్లు, లారీ డ్రైవర్లు, క్లీనర్లు ఉండిపోయారు. దీనిపై స్పందించిన అధికారులు వారిని పడవల్లో ఒడ్డుకు చేర్చారు. ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో భద్రాద్రి జిల్లా పర్ణశాల వద్ద సీత వాగు ఉప్పొంగింది. ఈ ప్రవాహంతో పర్ణశాల వద్ద గల నార చీరల ప్రాంతం సీతమ్మ వారి విగ్రహం మునిగాయి. దీంతో అధికారులు భక్తులను పరిసర ప్రాంతాలకు అనుమతించట్లేదు.

# పరుగులు తీస్తున్న కృష్ణమ్మ

**జూరాల 24 క్రస్టు గేట్ల ఎత్తివేత**

**శ్రీశైలం ప్రాజెక్టులోకి 1.31 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో**



**ధరూరు/అచ్చంపేట:** ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులోకి భారీ ఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. గురువారం రాత్రి 9 గంటల వరకు ప్రాజెక్టుకు 1.04 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. శుక్రవారం రాత్రి 8 గంటల వరకు 1.22 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. కృష్ణానది వరద ప్రవాహాన్ని బట్టి ఉదయం నుంచి క్రమక్రమంగా క్రస్టు గేట్ల సంఖ్యను పెంచుతూ నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు 24 క్రస్టు గేట్లను ఎత్తి స్పిల్‌వే ద్వారా 95, 592 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి ద్వారా మరో 35,502 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతు న్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.01 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు పీజేపీ అధికారులు తెలిపారు. ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు భారీ ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. శ్రీశైలం జలాశయానికి భారీగా వరద వస్తోంది. శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో ప్రాజెక్టుకు జూరాల నుంచి స్పిల్‌వే, విద్యుదుత్పత్తి ద్వారా 1,31,094 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 834.40 అడుగులతో 54 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా.. గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 215.807 టీఎంసీలు.

## మీ పెట్టుబడులకు రక్షణ

-మొదటిపేజీ తరువాయి

విధానపరమైన స్తబ్దత లేదని.. నాయకులు ఎవరైనా, పార్టీ ఏదైనా మంచి పాలసీ తీసుకొస్తే అది కొనసాగుతోందన్నారు. ఫారూచ్యన్ 500 కంపెనీలు భారత్ ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టాలనేది తమ ఆకాంక్ష అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. కాలుష్యంతో ఢిల్లీ, వర్షాలతో ముంబై, ట్రాఫిక్ కష్టాలతో బెంగళూరు, ప్రకృతి వైపరీత్యాలతో చెన్నై సతమవుతున్న నేపథ్యంలో భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని తెలంగాణను క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించామని సీఎం చెప్పారు. ఔటర్ రింగ్‌రోడ్డు లోపల ప్రాంతాన్ని క్యూర్‌గా గుర్తించామని, ఇక్కడ సేవా రంగానికి పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. ఔటర్ నుంచి రీజనల్ రింగ్‌రోడ్డు వరకు ప్రాంతాన్ని ప్యూర్‌గా గుర్తించామని.. అక్కడ తయారీ రంగానికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. రీజనల్ రింగ్‌రోడ్డు వెలుపల వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు రేవంత్ వివరించారు. హైదరాబాద్ పరిధిలోని పరిశ్రమలను ప్యూర్ ప్రాంతానికి తరలిస్తామని స్పష్టం చేశారు. రేడియల్ రోడ్లు నిర్మిస్తామని.. పోర్టుకు అనుసంధానంగా రహదారులు అభివృద్ధి చేస్తామన్నారు. ఫ్యూచర్ సిటీ నుంచి మచిలీపట్నం పోర్టు వరకు 12 లేన్ల రహదారి నిర్మిస్తున్నామని తెలిపారు.

### రెట్టింపు ఆదాయం..

తెలంగాణ సంస్కృతి తమకు పెద్ద ఆస్తి అని.. హైదరాబాద్‌లో అన్ని రాష్ట్రాల ప్రజలున్నారని సీఎం చెప్పారు. ఇక్కడ పెట్టుబడులు పెట్టిన దానికి రెట్టింపు ఆదాయం వస్తుందన్నారు. పారిశ్రామికవేత్తలు కోరిన వసతులు కలిపస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నిత్యం అందుబాటులో ఉంటారని చెప్పారు. పరిశ్రమల శాఖ మంత్రి రెండు నెలలకోసారి, తాను మూడు నెలలకోసారి అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. తెలంగాణను తమ సొంత ప్రాంతంగా భావించాలని సీఐఐ ప్రతినిధులకు సీఎం సూచించారు.

### డిమాండ్ ఉన్న కోర్సులే..

ఏఐ సునామీతో వైట్‌కాలర్ ఉద్యోగాలు పోతున్నందున తాము నైపుణ్యాభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించినట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇందుకోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నెలకొల్పామని చెప్పారు. ఐటీఐలను ఏటీసీలుగా మారుస్తున్నామని.. వాటిలో శిక్షణ పొందిన వారికి 100 శాతం ఉద్యోగాలు వచ్చాయన్నారు. డిమాండ్ ఉన్న కోర్సులనే బోధిస్తున్నామన్నారు. హైదరాబాద్‌లోని జీసీసీల్లో 200 కంపెనీలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చాయని చెప్పారు. డేటా సెంటర్లపై అమెజాన్ రూ. లక్ష కోట్లు, అదానీ రూ. 35 వేల కోట్లు పెట్టుబడి పెడుతున్నాయని వివరించారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు రామకృష్ణారావు, పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రటరీ కృష్ణ ఆదిత్య, సీఐఐ ఉత్తరాది వైస్ చైర్మన్ శారదా సూరి మార్వా తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో ఎస్ఐఆర్ గడువు తేదీ మరోసారి పెంపు

-మొదటిపేజీ తరువాయి


ఎన్యుమరేషన్ పూర్తయింది. రాష్ట్రవ్యాప్తంగా 3.38కోట్లకు పైగా ఓటర్లు ఉండగా ఇంకా సుమారు 60 లక్షల మంది ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించలేదు. వారిలో సుమారు 30లక్షల మంది అన్?కలెక్టెబుల్ కేటగిరీలో ఉన్నట్లు బీఎల్ఓలు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయానికి నివేదించినట్లు తెలుస్తోంది. చనిపోవడం లేదా శాశ్వతంగా మరో ప్రాంతానికి వెళ్లిపోవడం లేదా పూర్తిగా అందుబాటులో లేకపోవడం వంటి కారణాల వల్ల ఫారాలు ఇవ్వడం లేదని గుర్తించారు. అలాంటి ఓటర్ల పేరు ముసాయిదా జాబితా నుంచి తొలగించే అవకాశం ఉంది.

తెలంగాణలో చేపట్టిన సర్ ప్రక్రియపై కీలక సమాచారం వెల్లడైంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40 లక్షల ఓట్లను మళ్లీ తిరిగి వెనక్కి తీసుకునేందుకు వీలు లేని (అన్‌కలెక్టబుల్) వాటిగా పరిగణిస్తూ వాటిని తొలగించేందుకు ఎన్నికల అధికారులు సిద్ధమవుతున్నట్లుగా సమాచారం. సర్వే పూర్తయిన ప్రాంతాల్లో ఓటర్లకు నూరు ఎన్యూమరేషన్? పత్రాలు అందించామని, వాటిలో కొన్ని పత్రాలు సేకరించేందుకు వీలు లేకుండా ఉండటంతో వాటిని అన్?కలెక్టబుల్?గా నిర్ధారిస్తున్నట్లు అధికారులు గణాంకాలతో చూపిస్తున్నట్లు తెలిసింది.

### రెండు వారాల్లోనే 13 లక్షల నుంచి 40 లక్షలకు

అన్‌కలెక్టబుల్ జాబితాలో ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్ (ఏఎస్‌డీ) కేటగిరీ కింద ఉండే ఓటర్లను చేరుస్తూ, వారి ఓట్లను తీసివేసేందుకు సిద్ధం చేస్తున్నట్లు ఎన్నికల సంఘం(ఈసీ) అధికారులు చెబుతున్నారు. అయితే 14 రోజుల కిందట సోషల్ మీడియాలో ఎలక్షన్ కమిషన్? డ్యాష్?బోర్డు వైరల్? అయ్యింది. అందులో 13 లక్షల మంది ఓటర్లు ఏఎస్?డీ పరిధిలో అన్?కలెక్టబుల్? కింద నమోదైనట్లుగా అధికారులు పేర్కొన్నారు. ఈ సంఖ్య రెండు వారాల్లోనే 40 లక్షలకు చేరుకోవడం గమనార్హం.

## రాష్ట్రంలో ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ ప్రక్రియ షురూ




-మొదటిపేజీ తరువాయి

కుటుంబ సభ్యులందరి పేర్లు, వయసు, కుటుంబ పెద్దతో బంధుత్వం, ఆధార్ నంబరు, చిరునామా తదితర వివరాలు ఉంటాయి. ప్రజలకు అవసరమైనప్పుడు మీ–సేవ కేంద్రాల ద్వారా కుటుంబ రిజిస్టర్ సర్టిఫికెట్?ను ఇస్తారు. మీ సేవలో రెవెన్యూ సర్వీసుల విభాగంలో ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ అనే కొత్త సర్వీసు రానున్నట్లుగా తెలుస్తోంది.

### డేటా ఫ్యామిలీ రిజిస్టర్‌కు అనుసంధానం

మీ సేవ సెంటర్లు , యాప్, వాట్సప్ ద్వారా నిర్ణీత రుసుము చెల్లించి ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసిన రెండు రోజుల్లోనే సంబంధిత మండల తహసీల్దార్ రేషన్ కార్డు డేటా ఆధారంగా డిజిటల్ సైన్?తో మీ సేవ ద్వారా ధ్రువపత్రాన్ని జారీ చేస్తారు. ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ కుటుంబ సభ్యుల వివరాల కోసమేనని ఆస్తులపై హక్కులు, లీగల్ హెయిర్ నిర్ధరణకు ఉపయోగపడదని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది.

కుటుంబ రిజిస్టర్‌లో నమోదైన వివరాలన్నీ ధ్రువపత్రంలో ఇవ్వనున్నారు. పౌర సరఫరాల శాఖ డేటాను ఫ్యామిలీ రిజిస్టర్‌కు అనుసంధానం చేయడంతో పాటు మీ సేవ ద్వారా సర్టిఫికెట్?ను జారీ చేసేందుకు అసరమైన సాఫ్ట్‌వేర్‌ను సిద్ధం చేయాలని ఎలక్ట్రానిక్ సేవల డెలివరీ విభాగాన్ని ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. అవసరమైన వివరాలను ఈఎస్‌డీ విభాగానికి ఇవ్వాలని సివిల్? సప్లైస్?శాఖకు స్పష్టం చేసింది.

### ఎందుకోసం ఈ ఫ్యామిలీ రిజిస్ట్రేషన్

ప్రభుత్వ పథకాలు, ఇతర అవసరాల కోసం కుటుంబ వివరాల ధ్రువీకరణకు సంబంధించి ఇప్పటి వరకు సరైనటువంటి రికార్డులు లేవు. లబ్ధిదారుల కుటుంబ సభ్యుల వివరాల కోసం వారు చెప్పిందే నమ్మాల్సిన పరిస్థితి. ప్రజలు తమ కుటుంబ సభ్యుల వివరాలతో కూడిన అధికారిక సర్టిఫికెట్ పొందే అవకాశం లేదు. ఇలాంటి సమస్యలన్నింటికీ చెక్ పెట్టేందుకు అధికారికంగా ఫ్యామిలీ రిజిస్టర్?ను తయారు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమల్లో ఫ్యామిలీ రిజిస్టర్ కీలకంగా మారే అవకాశం ఉంది. ఉత్తరప్రదేశ్, హరియాణా, కర్ణాటక, ఉత్తరాఖండ్, తమిళనాడు, రాజస్థాన్ రాష్ట్రాలు పలు పేర్లతో రాష్ట్ర స్థాయి కుటుంబాల డేటా బేస్?ను నిర్వహిస్తున్నాయి. ఫ్యామిలీ రిజిస్టర్ నిర్వహణ, ప్రజలకు సర్టిఫికెట్ ఇచ్చే బాధ్యతను ప్రభుత్వం రెవెన్యూ శాఖకు అప్పగించింది. ఫ్యామిలీ రిజిస్టర్, సర్టిఫికెట్ల విధి విధానాలపై రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్? కుమార్ ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశారు.

# సంపాదకీయం

## తెల్ల ఏనుగులా మారిన పశ్చిమాసియా యుద్ధం

పశ్చిమాసియా యుద్ధం అమెరికా పాలిట తెల్లఏనుగులా మారింది. యుద్ధం కోసం అమెరికా దాదాపుగా 3.6 లక్షల కోట్లు ఖర్చు పెడుతోంది . ఇదే విషయాన్ని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ వెల్లడించారు. యుద్ధాన్ని కొనసాగించేందుకు, క్షీణిస్తున్న వనరులను తిరిగి సమకూర్చుకునేందుకు మరిన్ని అత్యవసర నిధులు కావాలని ట్రంప్ ప్రభుత్వం కోరుతున్న నేపథ్యంలో ఆయన ఈ వివరాలను చట్టసభ సభ్యులకు అందించారు. సెనేట్ అప్రాప్రియేషన్స్ కమిటీ ఎదుట జరిగిన విచారణలో హెగ్‌సెత్ ఈ నూతన అంచనాలను తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ 30తో ముగియనున్న నేపథ్యంలో ఆ లోపు అయ్యే ఖర్చులను కూడా కలుపుకుని ఈ అంచనాను రూపొందించారు. గతంలో మే, జూన్ నెలల్లో ఈ వ్యయం సుమారు 29 నుంచి 30 బిలియన్ డాలర్లుగా ఉంటుందని అంచనా వేయగా, ప్రస్తుతం ఆ సంఖ్య గణనీయంగా పెరిగింది. యుద్ధ కార్యకలాపాల కోసం సుమారు 67 బిలియన్ డాలర్ల అదనపు రక్షణ నిధులను కేటాయించాలని జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్ జనరల్ డాన్ కెయిన్‌తో కలిసి హెగ్‌సెత్ సెనేట్‌ను అభ్యర్థించారు. ఈ ఏడాది ఫిబ్రవరి చివర్లో అమెరికా, ఇజ్రాయెల్ దాడులతో మొదలైన ఈ ఘర్షణ, ఈ నెల ప్రారంభంలో కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ విఫలం కావడంతో మళ్లీ తీవ్రరూపం దాల్చింది. ప్రస్తుతం ఇరు పక్షాల మధ్య ప్రతిరోజూ దాడులు, ప్రతిదాడులు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ పట్టును బలహీనపరిచే లక్ష్యంగా అమెరికా దాడులు సాగుతున్నాయి. ఈ జలసంధిలో ఏర్పడిన అంతరాయాలు అమెరికాలో గ్యాస్ ధరల పెరుగుదలకు కారణమయ్యాయి. ఈ ఘర్షణలో ఇప్పటివరకు 17 నుంచి 18 మంది అమెరికా సైనికులు ప్రాణాలు కోల్పోయారని, వంద మందికి పైగా గాయపడ్డారని పెంటగాన్ వెల్లడించింది. గాయపడిన వారిలో చాలామంది తిరిగి విధుల్లో చేరినట్లు అధికారులు తెలిపారు. అయితే, యుద్ధ వ్యూహం, కాలపరిమితిపై స్పష్టమైన సమాచారం ఇవ్వడం లేదని ఇరు పార్టీల చట్టసభ సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా మధ్యంతర ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ యుద్ధం వల్ల కలుగుతున్న ఆర్థిక, మానవ నష్టాన్ని డెమొక్రాట్లు ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. కాంగ్రెస్‌లో రిపబ్లికన్లకు స్వల్ప మెజారిటీ మాత్రమే ఉండటంతో, నిధుల కేటాయింపు బిల్లు ఆమోదం పొందాలంటే ఉభయపక్షాల మద్దతు తప్పనిసరి. మరోవైపు ఈ విచారణ జరుగుతున్న సమయంలోనే కొందరు నిరసనకారులు సభకు అంతరాయం కలిగించి యుద్ధానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని గణనీయంగా దెబ్బతీశామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, అధ్యక్షుడు ట్రంప్ మరిన్ని దాడులకు సంకేతాలు ఇస్తుండటం గమనార్హం. మరో వైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించినట్లుగానే ఇరాన్ పై .. యూఎస్ ఆర్మీ దాడులు ముమ్మరం చేసింది. ఇరాన్ లోని కీలక టార్గెట్లపై అమెరికా విరుచుకుపడింది. అగ్రరాజ్యం దాడులతో ఇరాన్ దద్దరిల్లింది. జోర్డాన్‌లోని తమ స్థావరాలు లక్ష్యంగా ఇరాన్ చేసిన దాడికి ప్రతిగా ఈ శక్తిమంతమైన దాడులు జరుగుతున్నాయని యూఎస్ మిలిటరీ వెల్లడించింది. మరోవైపు.. జోర్డాన్‌లోని బేస్‌లపై దాడులను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా పరిగణించారు. "మేం వారిని గట్టిగా దెబ్బకొడతాం" అని ప్రకటించారు. ఆ క్రమంలోనే దక్షిణ ఇరాన్ లో శక్తిమంతమైన పేలుళు వినిపిస్తున్నాయి. ఖేష్మ్ ద్వీపాన్ని, అణువిద్యుత్ కేంద్రం ఉన్న తీరనగరం బుషెహర్‌ను అమెరికా సైన్యం టార్గెట్ చేసింది. ఖేష్మ్ ద్వీపంలో నివాస ప్రాంతాలపై క్షిపణి దాడి జరిగిందని ఇరాన్ స్థానిక మీడియా వెల్లడించింది. జోర్డాన్‌లోని ఎయిర్‌బేస్, కమాండ్ సెంటర్‌ను టార్గెట్ చేశామని ఐఆర్‌జీసీ వెల్లడించింది. అమెరికా బెదిరింపులు కొనసాగినంత కాలం.. ఇరాన్ వైపు నుంచి ప్రతిఘటన ఉంటుందని హెచ్చరించింది. అయితే ఇరాన్ ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణులను తాము అడ్డుకున్నామని యూఎస్ సెంట్రల్ కమాండ్ పేర్కొంది. తాము డజన్ల కొద్దీ ఇరాన్ లక్ష్యాలపై దాడులు చేసినట్లు పేర్కొంది. ఇరాన్, గల్ఫ్ దేశాలకే పరిమితమైన యుద్ధం బుధవారం మరో టర్న్ తీసుకుంది. ఈజిప్ట్‌లోని డమియెట్టా పోర్ట్‌లోని అమెరికాకు చెందిన గ్యాస్ ట్యాంకర్‌పై డ్రోన్ దాడి చేసింది. దాంతో ఎల్‌ఎన్‌జీ లోడింగ్, ఇతర ప్రక్రియలు జరుగుతోన్న సమయంలో ఈ దాడి జరగడంతో భారీగా మంటలు ఎగిసిపడి, వేగంగా మరో ట్యాంకర్‌కు విస్తరించాయి. దాంతో అత్యవసర సహాయక బృందాలు నావికులను అక్కడి నుంచి తరలించాయి. ఇంధన నిల్వలున్న మరో దేశానికి ఘర్షణలు విస్తరించడంతో యుద్ధం తీవ్ర రూపం దాల్చుతుందోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

# ఈసారి 'ఆల్ఫా' వంతు!



జంతర్ మంతర్ వేదికగా జెన్ జీ తరం సృష్టించిన పెను సంచలనం గురించి అందరూ ఇంకా చర్చించుకుంటుండగానే... తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ ఆల్ఫా తరం కూడా తరగతి గదుల్లోంచి బయటికొచ్చింది. ఉత్తరాదిన ఉత్తరప్రదేశ్, బిహార్, రాజస్థాన్‌లతో పాటు మహారాష్ట్రలో సైతం పాఠశాలల్లో మంచినీరు, మరుగుదొడ్లు, ఫ్యాన్లు, బెంచీలవంటి కనీస సదుపాయాలు కల్పించాలనీ, అన్ని పాఠ్యాంశాలకూ టీచర్లను నియమించా లనీ కోరుతూ సాగుతున్న ధర్నాల వెనక కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) సాధించిన విజయాల స్ఫూర్తి ఉన్నదని తెలుస్తూనే ఉంది.

పాలకుల్ని నిలదీసిన జెన్ జీ తరాన్ని చూసి అసహ్యించుకున్న ఎంపీ కంగనా రనౌత్ లాంటివారు ఈ ఆల్ఫా తరానికి ఎలాంటి శాపనార్థాలు పెడతారో చూడాల్సివుంది. బిహార్‌లోని గయ జిల్లాలో విద్యార్థులు అతి పెద్ద ధర్నా నిర్వహించడమే కాదు... తమ డిమాండ్లు తెలుసుకోవటానికొచ్చిన ప్రభుత్వాధికారిని వెనక్కిపంపారు. తాము జిల్లా మేజిస్ట్రేట్ (కలెక్టర్)తో తప్ప మాట్లాడబోమని చెప్పటంతో ఆయనే రావాల్సివచ్చింది. అన్నిచోట్లా ఒకే రకమైన సమస్యలు. అందరిదీ ఒకే రకమైన కథ. చదువు చుట్టూ ఇన్ని సమస్యలుండగా 'వికసిత్ భారత్' ఎలా సాధ్యమో పాలకులు చెప్పాలి. దేశంలో ప్రాథమిక విద్య మొదలు విశ్వవిద్యాలయ విద్యవరకూ అంతా అస్తవ్యస్థంగా ఉంది. ఎక్కడ చూసినా శిథిలాలను తలపించే బడులు, అరకొర సదుపా యాలు వెక్కిరిస్తుంటాయి. సరిపడా ఉపాధ్యాయులుండరు. యాదృచ్ఛికంగానే కావొచ్చు గానీ... రాజ్యసభలో గురువారం పాఠశాల విద్య గురించి అడిగిన ప్రశ్నకు విద్యామంత్రిత్వ శాఖ ఇచ్చిన జవాబు దిగ్భ్రమ గొలుపుతుంది. దేశంలో ఏకోపాధ్యాయ పాఠశాలల సంఖ్య 1,00,843 అని ఆ శాఖ సహాయమంత్రి చెప్పారు. అందులో 16,357 పాఠశాలలతో ఆంధ్రప్రదేశ్ తొలి స్థానంలో ఉంటే జార్ఖండ్(9,827), మహారాష్ట్ర(9,269), కర్ణాటక(8,042), ఉత్తరప్రదేశ్(7,874) తదనంతర స్థానాల్లో ఉన్నాయి.

అలాగని మిగిలిన స్కూళ్లు బాగున్నాయని కాదు. రాజస్థాన్‌లోని ఒక పాఠశాలలో కేవలం చరిత్ర, హిందీ పాఠ్యాంశాలకు మాత్రమే టీచర్లున్నారు. మరో పాఠశాలలో 1,2,3 తరగతులకు అసలు టీచర్లే లేరు. తక్షణం టీచర్ల నియామకం జరగకుంటే పాఠశాలకు తాళాలేసి, రహదారి దిగ్బంధిస్తామని పిల్లలు హెచ్చరించారు. చివరకు అప్పటికప్పుడు నలుగుర్ని నియమిస్తూ అధికారులు ఉత్తర్వులిచ్చారు. మరో ముగ్గుర్ని పది రోజుల్లో నియమిస్తామనటంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. ఉత్తర ప్రదేశ్‌లోని ఫతేపూర్‌లో లిఖితపూర్వక హామీ దొరికేవరకూ ఇంటర్ విద్యార్థులు ధర్నా కొనసాగించారు.

సెకండరీ విద్యలో 2023--24లో ఆడపిల్లల్లో 12.6 శాతంగా ఉన్న డ్రాపౌట్లు 2025--26కు 8 శాతానికి తగ్గాయని పార్లమెంటుకు సమర్పించిన నివేదిక చెబుతోంది. కానీ ఇప్పటికీ 8 శాతంమంది పిల్లలు ఆ స్థాయికొచ్చాక చదువులు మానుకుంటున్నారంటే ఆవేదన కలుగుతుంది. దీన్ని అంకెల్లోకి మారిస్తే లక్షల్లో ఉంటుంది. ఇది మన అధ్వాన్న స్థితికి అద్దం పడుతుంది. పేదరికం మొదలుకొని పాఠశాలలో సదుపాయాల లేమి వరకూ ఇందుకు ఎన్నో కారణాలుండొచ్చు. వాటిని సరిచేయటానికి పూనుకొనే వరకూ ఇలాంటి పిల్లలు చదువులకు దూరంకాక తప్పదని పాలకులు గుర్తించాల్సి ఉంది.

ఆంధ్రప్రదేశ్ బడి పిల్లల వ్యథ మరో రకం. అక్కడ గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 11,700 కోట్లు వ్యయం చేసి 'నాడు--నేడు' కింద 38,059 పాఠశాలల రూపురేఖల్ని మార్చింది. కార్పొరేట్ విద్యాసంస్థల్ని తలదన్నేలా 60,000 ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు, 10,000 స్మార్ట్ టీవీలు అమర్చి తరగతి గదుల్ని డిజిటల్ లెర్నింగ్ స్పేస్‌లుగా మార్చింది. పిల్లలకు దాదాపు ఆరు లక్షల ట్యాబ్‌ల్ని అందించి పాఠాల్ని సులభంగా అవగాహన చేసుకునేందుకు తోడ్పడింది.

ఇప్పుడు ఉత్తరాదిన వినబడుతున్న డిమాండ్లతోపాటు మరెన్నో నాలుగేళ్ల క్రితమే అందుబాటులోకి తెచ్చింది. ఇప్పుడు అందులో చాలా భాగం అటకెక్కాయి. గుక్కెడు మంచినీళ్లు, పరిశుభ్రమైన పరిసరాలు, రుచికరమైన మధ్యాహ్న భోజనం కరువయ్యాయి. గతంలో సకల సదుపాయాలతో వర్ధిల్లిన బడులన్నీ ఇప్పుడు బావురుమంటున్నాయి. అనేకం మూతబడ్డాయి. అందుకే ఉత్తరాది పిల్లల స్ఫూర్తితో రేపో మాపో ఏపీ ఆల్ఫా తరం కూడా తిరగబడినా ఆశ్చర్యం లేదు.

# మళ్లీ కావేరీ వివాదం



ఎంతో సున్నితమైన నదీజలాల సమస్యను ప్రభుత్వాలు దశాబ్దాల తరబడి అపరిష్కృతంగా వదిలేయటంవల్ల అది కాస్తా మరింత జటిలమవుతోంది. రాష్ట్రాలమధ్యా, రాష్ట్రాల్లో ప్రాంతాలమధ్యా తరచు తలెత్తుతున్న జలవివాదాలు తీవ్ర రూపం దాలుస్తున్నాయి. ఎప్పటిలాగే కర్ణాటక, తమిళనాడుల మధ్య తాజాగా కావేరీ నదీజలాల పంపకం విష

యంలో చిచ్చు రేగింది. రోజూ 3,500 క్యూసెక్కుల చొప్పున తమిళనాడుకు 4.5 టీఎంసీల నీటిని విడుదల చేయాలని కావేరీ నీటి యాజమాన్య ప్రాధికార సంస్థ (సీడబ్ల్యూఎంఏ) కర్ణాటకకు ఇటీవల ఇచ్చిన ఆదేశాలు తాజా వివాదానికి మూలం. ఈ విషయంలో ఏం చేయాలన్న అంశంపై ఈ ఆదివారం కర్ణాటక ప్రభుత్వం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటుచేసింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి రావాలనుకుంటున్న బీజేపీ ఈ సమస్యపై అప్పుడే ఉద్యమం కూడా ప్రారంభించింది. కన్నడ సంఘాలు వచ్చే 13న రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ విషయంలో చర్చించేందుకు తమ రాష్ట్రానికి సోమవారం రావాల్సిన తమిళనాడు సీఎం విజయ్‌ను 'ప్రస్తుత పరిస్థితుల రీత్యా' వాయిదా వేసుకోవాలని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అభ్యర్థించారు. రాజ్యాంగంలోని 262వ అధికరణం నదీజలాల వినియోగం, పంపిణీ, నియంత్రణ వంటి అంశాల్లో రాష్ట్రాల మధ్య వివాదాలు రాజుకున్నప్పుడూ, ఫిర్యాదులొచ్చినప్పుడూ వాటి పరిష్కారం కోసం తగిన యంత్రాంగాన్ని ఏర్పాటుచేసే అధికారాన్ని పార్లమెంటుకు ఇచ్చింది. దీని ఆధారంగానే కేంద్రం 1956లో నదీజలాల వివాదాల చట్టాన్ని, నదీజలాల బోర్డు చట్టాన్ని తీసుకొచ్చింది. బోర్డు అయితే ఏర్పాటు కాలేదుగానీ... నదీ వివాదాల చట్టంకింద అయిదు ట్రిబ్యునల్స్ ఏర్పడ్డాయి. చిత్రమేమంటే ప్రజా ప్రభు త్వాలు లేని కాలంలోనే... అంటే బ్రిటిష్ వలసపాలకుల హయాంలోనే నదీజలాల ఒప్పందాలు కుదిరాయి. 1924లో అప్పటి మైసూర్ సంస్థానం, మద్రాస్ ప్రెసిడెన్సీలమధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం మైసూర్ కృష్ణరాజ సాగర్ డ్యామ్‌నూ, మద్రాస్ మెట్టూర్ డ్యామ్‌నూ నిర్మించుకోవటానికి అవగాహన కుదిరింది. అప్పట్లో కావేరీ జలాల్లో దాదాపు 75 శాతం వాటా మద్రాస్ ప్రెసిడెన్సీకే కేటాయించారు. ఈ ఒప్పందం కాలపరిమితి యాభైయ్యేళ్ల అనంతరం 1974లో ముగిసిపోగా అప్పటికే కర్ణాటకలో నదీజలాల కేటాయింపు విషయంలో తమకు అన్యాయం జరిగిందనే భావన బలంగా నాటుకుంది. ఎగువభాగంలో ఉండటం కారణంగా కర్ణాటక తమ నీటి అవసరాలకు తగ్గట్టు కొత్త ప్రాజెక్టుల నిర్మాణం కూడా చేపట్టింది. వర్షాలు సమృద్ధిగా పడినంతకాలం నదీ జలాల వివాదాలు వచ్చే అవకాశం లేదు. రుతుపవనాలు విఫలమై వర్షాభావ పరిస్థితులు ఏర్పడినా, కరవు కాటేసినా ఘర్షణలు బయల్దేరతాయి. కావేరీ బేసిన్‌లోని ఆనకట్టలు నిండనప్పుడు తాము బెంగళూరు నగరానికీ, రైతులకూ అవసరమైన నీరు వినియోగించుకోవటంలో తప్పేమిటన్నది కర్ణాటక ప్రశ్న. ఇటు తమవైపు పంటలన్నీ ఎండిపోతున్నాయనీ, న్యాయంగా తమ వాటా నీరు విడుదల చేయాలనీ తమిళనాడు అంటున్నది. అసలే ఈ ఏడాది 'సూపర్ ఎల్‌నినో' ప్రభావంతో వర్షాలు సరిగా లేవు. ఇలాంటి పరిస్థితుల్లో సహజంగానే వివాదాలు తలెత్తుతాయి. పుదుచ్చేరి కూడా ఈ కావేరీ జలాల వివాదంలో ఉంటుంది. పడమటి కనుమల్లో పుట్టి గోవా దగ్గర అరేబియా సముద్రంలో కలిసే మహాదాయి విషయంలోనూ కర్ణాటక, గోవాల మధ్య ఇలాంటి వివాదాలే తలెత్తుతుంటాయి. ప్రపంచ పునరుత్పాదక జలవనరుల్లో మన దేశం వాటా కేవలం 4 శాతం మాత్రమే. కనుక నీటి కోసం పోటీ తప్పదు. సమస్య తలెత్తినప్పుడల్లా తాత్కాలిక పరిష్కారంతో ప్రయత్నించి, గండం గడించిందనుకోవటం తప్ప శాశ్వత పరిష్కార దిశగా ఎవరూ ఆలోచించటం లేదు. ఘర్షణ పడే రాష్ట్రాలు ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో వ్యవహరిద్దామనుకోవటం లేదు. విపక్షాలనుంచి ఒత్తిళ్లు తప్పవు మరి. నదుల్లో నీరు నిండుకున్న ప్పుడు నీరందక పంటలు ఎండిపోతాయి. దృఢంగా పోరాడి ఆ నష్టాన్ని తగ్గించుకోవటంపైనే వివాదం తలెత్తిన రాష్ట్రాల రైతులు దృష్టి పెడతారు. కావేరీ వివాదం సామరస్య పూర్వకంగా పరిష్కారమయ్యే దిశగా రెండు రాష్ట్రాలూ చిత్తశుద్ధితో కృషిచేయాలి. ఇప్పుడిప్పుడే వరుణుడు కరుణిస్తున్న దాఖలా కనబడుతోంది. కనుక ఈ వివాదం త్వరలో సమసిపోతుందని ఆశించాలి.

# మూగబోయిన ఫైర్ బ్రాండ్స్

2024 ఎన్నికల ఓటమి అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో రాజకీయం ఊహించని మలుపు తిరిగింది. గతంలో ప్రత్యర్థిపార్టీల నేతలపై నిమిషానికో రీతిలో విరుచుకుపడే ఫైర్ బ్రాండ్ నాయకులు ఆర్.కే. రోజా, కొడాలి నాని, జోగి రమేష్, వల్లభనేని వంశీ వంటి కీలక నేతలు రాజకీయంగా పూర్తిగా మౌనం వహించారు. ఎన్నికలు ముగిసి రెండేళ్లు దాటిపోయినా వీరు పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పాల్గొనకపోవడం, మీడియా ముందుకు రాకపోవడం కేడర్‌లో తీవ్ర నిరాశను నింపుతోంది. ప్రస్తుతం కేవలం పేర్ని నాని, అంబటి రాంబాబు వంటి కొద్దిమంది నాయకులు మాత్రమే మైకుల ముందుకు వచ్చి ప్రత్యర్థులపై ఎదురుదాడి చేస్తున్నారు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నమోదైన వరుస కేసులు, చట్టపరమైన చర్యల భయంతో స్లో అయ్యారు. జోగి రమేష్ పై సిఐడి కేసులు, అగ్రిగోల్డ్ భూ వివాదం, తాజాగా కుటుబం కేసులు కూడా వచ్చి పడ్డాయి. అలాగే వల్లభనేని వంశీ చాలా రోజులు జైల్లో ఉండి వచ్చారు. కొడాలి నాని అనారోగ్యం, రాజకీయ ఒత్తిళ్ల కారణంగా అసలు గుడివాడలోనే కనిపించడంలేదు. ఐదేళ్ల పాలనలో వ్యక్తిగత దూషణలతో తీవ్ర స్థాయి విమర్శలు చేసిన ఈ నేతలు, ఇప్పుడు అధికార పక్షం కఠినంగా వ్యవహరిస్తుండటంతో చట్టపరమైన చిక్కుల నుంచి తప్పించుకునేందుకు తాత్కాలికంగా రక్షణాత్మక వైఖరి లోకి వెళ్లిపోయారనేది స్పష్టమవుతోంది.

# భక్తిశ్రద్ధల మధ్య కొనసాగుతున్న శ్రీకృష్ణ కాలచక్రం విశ్వశాంతి మహాయాగాలు

**కోటి కుంకుమ పుష్పార్చనలు మరియు అభిషేకాలు నిర్వహించిన భక్తులు**
**యజ్ఞంలో ప్రత్యేక పూజలు చేసిన బీచని బాల కృష్ణ దంపతులు**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కల్వకుర్తిలో నిర్వహిస్తున్న శ్రీకృష్ణ కాలచక్రం 91 వ విశ్వ శాంతి మహా యాగ 12 వ రోజు మహోత్సవాలు భక్తి శ్రద్ధల మధ్య వైభవంగా కొనసాగుతున్నాయి. శ్రీకృష్ణ పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ వారి దివ్య మంగళ శాసనాల మేరకు నిర్వహిస్తున్న ఆయుధ చండీ, అతిరుద్ర మహాయాగంలో భాగంగా పలు విశేష ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 7:30 గంటలకు విశేష శ్రీ చండీ హోమంలో శ్రీ మహాలక్ష్మి హోమములు విశేషాల లక్ష్మి పాశుపత సహిత అష్టలక్ష్మి సరస్వతి హోమములు నిర్వహించడం జరిగింది. ఈ హోమము లో పాల్గొని శివునికి అభిషేకం చేసి యజ్ఞంలో కూర్చొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసిన రైస్ మిల్లు అసోసియేషన్ అధ్యక్షుడు బీచని బాలకృష్ణ అని నిర్వాహకులు జూలూరి రమేష్ బాబు అన్నారు.



ప్రత్యేక పూజలు, హోమాల్లో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు కోటి కుంకుమ పుష్పార్చనలు శ్రీ చక్ర విశేష అభిషేక అర్చనలు నిర్వహించడం జరిగింది. ఈ దీపోత్సవం కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తిలకించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడగా, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని విశ్వశాంతి, లోకక్షేమం, కుటుంబ సౌభాగ్యం కోసం ప్రార్థనలు చేశారు. ఈ మహాయాగ మహోత్సవాలు మరికొన్ని రోజుల పాటు కొనసాగనున్నాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక సేవలను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో, ఆర్య వైశ్య సంఘం రాష్ట్ర నాయకులు జూలూరి రమేష్ బాబు, రైస్ మిల్లు అసోసియేషన్ అధ్యక్షుడు బీచని బాలకృష్ణ, పాపి శెట్టి శ్రీనివాసులు, రైస్ మిల్లు అసోసియేషన్ కోశాధికారి ఎన్మనగండ్ల రవి,గోవిందు కృష్ణయ్య, మనోహర్,దారమోని గణేష్,సురేష్, ఆర్య వైశ్య సంఘం నాయకులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## స్ప్రింక్లర్లకు రైతులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలి



**ప్రభుత్వ సబ్సిడీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి**
**మండల కాంగ్రెస్ అధ్యక్షులు కాసు శ్రీనివాస్ రెడ్డి**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై అందిస్తున్న స్ప్రింక్లర్ల పథకానికి దరఖాస్తుల గడువు నేటి (జూలై 31)తో ముగియనున్నందున అర్హులైన రైతులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ రెడ్డి కోరారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చొరవతో తలకొండపల్లి మండల రైతుల కోసం ప్రభుత్వం 100 స్ప్రింక్లర్లను మంజూరు చేసిందని తెలిపారు. రైతులు కేవలం 9000 డిమాండ్ డ్రాఫ్ట్ (డీడీ) తో పాటు అవసరమైన పత్రాలను జత చేసి దరఖాస్తు సమర్పించాలని సూచించారు. వ్యవసాయంలో నీటి వినియోగాన్ని తగ్గిస్తూ పంటలకు సమర్థవంతంగా సాగునీరు అందించడంలో స్ప్రింక్లర్ విధానం ఎంతో ఉపయోగకరమని, దీనివల్ల మెరుగైన దిగుబడులు సాధించవచ్చని కాసు శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సబ్సిడీ అవకాశాన్ని ప్రతి అర్హ రైతు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. నేటితో గడువు ముగియనున్నందున ఇక ఆలస్యం చేయకుండా సంబంధిత వ్యవసాయ మార్కెట్ కార్యాలయాన్ని సంప్రదించి దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గడువు అనంతరం దరఖాస్తులు స్వీకరించే అవకాశం ఉండదని, ఈ అవకాశాన్ని ఏ రైతూ కోల్పోవద్దని సూచించారు.

## కుల నిర్మూలనపై ప్రభుత్వాల వైఫల్యం..!



**కుల వ్యవస్థను రద్దు చేయకుండా సామాజిక సమానత్వం సాధ్యం కాదు**
**డా. జేవీ రాజు**
**అమెరికాలో బానిసత్వాన్ని రద్దు చేసిన అబ్రహం లింకన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచన**

అగ్ని ధార న్యూస్,( రామగుండం)

దేశంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు, ప్రధానులు, ముఖ్యమంత్రులు సామాజిక సమానత్వంపై మాట్లాడుతున్నప్పటికీ, కుల వ్యవస్థ నిర్మూలన దిశగా స్పష్టమైన చర్యలు తీసుకోకపోవడం విచారకరమని న్యూ ఇండియా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా. జేవీ రాజు విమర్శించారు. కుల వ్యవస్థ కొనసాగినంత కాలం భారతదేశంలో నిజమైన ప్రజాస్వామ్యం, సమాన అవకాశాలు, సామాజిక న్యాయం పూర్తిస్థాయిలో అమలు కావని ఆయన అభిప్రాయపడ్డారు. ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, అమెరికా మాజీ అధ్యక్షుడు అబ్రహం లింకన్ బానిసత్వాన్ని రద్దు చేసి చరిత్రలో నిలిచిపోయారని గుర్తు చేశారు. సమాజంలో శతాబ్దాలుగా కొనసాగుతున్న అన్యాయ వ్యవస్థలను రాజకీయ సంకల్పంతో తొలగించడం నాయకత్వ లక్షణమని పేర్కొన్నారు. భారతదేశంలో కూడా కుల వివక్ష నిర్మూలనపై చట్టపరంగా, సామాజికంగా, విద్యా రంగంలో సమగ్ర సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. కుల ఆధారిత వివక్ష, అసమానతలు కొనసాగుతున్నప్పటికీ వాటి మూల కారణాలను తొలగించే దిశగా పాలకులు ముందుకు రావడం లేదని విమర్శించారు. కుల వ్యవస్థను పూర్తిగా నిర్మూలించకుండా అభివృద్ధి, సమానత్వం, సామాజిక న్యాయం వంటి అంశాలపై చేసే ప్రకటనలు అసంపూర్ణంగానే మిగిలిపోతాయని ఆయన అభిప్రాయపడ్డారు. దేశ రాజకీయ నాయకత్వం కులరహిత సమాజ నిర్మాణాన్ని జాతీయ లక్ష్యంగా స్వీకరించి కార్యాచరణ రూపొందించాలని కోరారు. డా. జేవీ రాజు మాట్లాడుతూ, భారత రాజ్యాంగం సమానత్వాన్ని హామీ ఇస్తున్న నేపథ్యంలో కుల వివక్షను నిర్మూలించేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు చిత్తశుద్ధితో ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలను కులాల పేరుతో విభజించే రాజకీయాలకు స్వస్తి పలికి, సమాన హక్కులు, సమాన అవకాశాలు కల్పించే విధానాలకే ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు.

## స్ప్రింక్లర్లకు నేటితో గడువు ముగియడంతో రైతులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలి



**సబ్సిడీ రైతులు సద్వినియోగం చేసుకోవాలి సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

తలకొండపల్లి ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై అందిస్తున్న స్ప్రింక్లర్ల పథకానికి దరఖాస్తుల గడువు నేటి (జూలై 31)తో ముగియనున్నందున అర్హులైన రైతులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చొరవతో తలకొండపల్లి మండలం, పడకల్ గ్రామ రైతుల కోసం ప్రభుత్వం తలకొండపల్లి మండలానికి 100 స్ప్రింక్లర్లను మంజూరు చేయడం జరిగింది అని సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి తెలిపారు. రైతులు కేవలం రూ,9000 డిమాండ్ డ్రాఫ్ట్ (డీడీ)తో పాటు అవసరమైన పత్రాలను జత చేసి దరఖాస్తు సమర్పించాలని సూచించారు. వ్యవసాయంలో నీటి వినియోగాన్ని తగ్గిస్తూ పంటలకు సమర్థవంతంగా సాగునీరు అందించడంలో స్ప్రింక్లర్ విధానం ఎంతో ఉపయోగకరమని, దీనివల్ల మెరుగైన దిగుబడులు సాధించవచ్చని సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సబ్సిడీ అవకాశాన్ని ప్రతి అర్హ రైతు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. నేటితో గడువు కాలం ముగించడంతో ఇక ఆలస్యం చేయకుండా సంబంధిత వ్యవసాయ మార్కెట్ కార్యాలయాన్ని సంప్రదించి దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గడువు అనంతరం దరఖాస్తులు స్వీకరించే అవకాశం ఉండదని, ఈ అవకాశాన్ని ఏ రైతూ కోల్పోవద్దని సూచించారు.

## ప్రజా ఆరోగ్యానికి ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛ జలధార




**జంగారెడ్డిపల్లిలో త్రాగునీటి ట్యాంకుల శాస్త్రీయ పరిశుభ్రత**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

తలకొండపల్లి మండల ప్రజలకు పరిశుభ్రమైన త్రాగునీరు అందించి వారి ఆరోగ్యాన్ని పరిరక్షించాలనే లక్ష్యంతో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో చేపట్టిన స్వచ్ఛ జలధార.కార్యక్రమం తలకొండపల్లి మండలంలోని జంగారెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని త్రాగునీటి నిల్వ ట్యాంకులను జర్మన్ సాంకేతికతతో కూడిన ప్రత్యేక యంత్రాల సహాయంతో శాస్త్రీయ పద్ధతిలో శుభ్రపరిచారు. ట్యాంకుల్లో పేరుకుపోయిన మురికి, నాచు, వ్యర్థాలను పూర్తిగా తొలగించి పరిశుభ్రతను నెలకొల్పడంతో పాటు త్రాగునీటి నాణ్యత మెరుగుపడేలా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమం ద్వారా నీటి ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించడంతో పాటు గ్రామీణ ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో స్వచ్ఛ జలధార కార్యక్రమాన్ని దశలవారీగా అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పరిశుభ్రమైన త్రాగునీరు.. ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది అనే సందేశాన్ని ప్రజలకు అందించారు. ఇది కేవలం ట్యాంకుల పరిశుభ్రత కార్యక్రమం మాత్రమే కాకుండా, ప్రజా ఆరోగ్య పరిరక్షణకు ఐక్యత ఫౌండేషన్ చేపట్టిన సామాజిక బాధ్యతాయుత కార్యక్రమమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పసుల మల్లేష్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు, ఐక్యత ఫౌండేషన్ ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటా



**కుటుంబ సభ్యులను పరామర్శించిన సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

తలకొండపల్లి మండలశీ లోని లింగరావు పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సినియర్ నాయకులు మాజీ ఉప సర్పంచ్ వెల్దండ సత్యనారాయణ మాతృమూర్తి వెల్దండ సుభద్ర అనారోగ్యంతో మరణించడం జరిగింది. విషయాన్నీ తెలుసుకున్న సర్పంచ్ తలకొండపల్లీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాసు శ్రీనివాస్ రెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటానని ప్రగాఢ సానుభూతి తెలియజేయండం జరిగింది. ఈ కార్యక్రమం లో కుమారులు సత్యనారాయణ ప్రకాష్ మరియూ గ్రామ పెద్దలు బాల్ రెడ్డి తదితరులు పాల్గొనడం జరిగింది.

## ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై బిఎల్ఓ బిఎల్ఏ లతో సమావేశం



**మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకంలో కొనసాగుతున్న ఎస్ ఐ ఆర్ నందు డిజిటలైజేషన్ తో పాటు డబల్ ఓట్లు మరియు మరణించిన వ్యక్తుల ఓట్లు కలుపుకొని ఇప్పటివరకు 95% పూర్తయిందని మిగిలిన 5% శాతం పూర్తి చేసినందుకు మూడు రోజులు గడువు మాత్రమే ఉందని ఆగస్టు 3 తేదీలోపు 100% పూర్తి చేయాలని బిఎల్ఓ లకు ఆదేశాలు జారీ చేసిన కమిషనర్. ఇట్టి విషయంలో పట్టణ ప్రజలు ఇంకా ఎవరైనా తమరి ఓటు ఎన్యూమరేషన్ ఫామ్ ను బిఎల్ఓ లకు అందజేయని వారి వివరాలు వెంటనే అందజేసి వారి ఓటును డిజిటలైజ్ చేయించుకోవాలని కోరడం జరిగింది. పట్టణ ప్రజలు ఎవరైనా తమ ఎన్యూమరేషన్ ఫారం ను బిఎల్ఓ లకు అందజేయకపోయినా, తమ వివరాలు తెలియజేయ కపోయినా తమ ఓటు గల్లంతవుతుందని తెలియజేయడం జరిగింది. కావున పట్టణంలో తమ ఓటు ఎన్యూమరేషన్ ఫారం అందజేయని వారు వెంటనే సంబంధిత బిఎల్ఓ కు వివరాలతో కూడిన ఎన్యూమరేషన్ ఫారం అందజేయాలని కోరడం జరిగింది. సమావేశంలో వైస్ చైర్మన్ శానవాజ్ ఖాన్, బిఎల్వోలు బిఎల్ఎ లు సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ఎక్సైజ్ సీఐ జన్మదిన వేడుకలు



**శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన ఉప్పల వెంకటేష్**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

అమనగల్ పట్టణంలో ఎక్సైజ్ సి ఐ బద్యనాథ్ చౌహన్ జన్మదిన వేడుకలు ఎక్సైజ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సందర్భంగా ఎక్సైజ్ కార్యాలయం లో సిఐ బాద్య నాథ్ చౌహన్ నీ మర్యాద పూర్వకంగా కలిసి కి శాలువాతో సన్మానించి జన్మ దిన శుభాకాంక్షలు తెలిపిన మాజీ రాష్ట్ర మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ఈ కార్యక్రమంలో వెంకట్రాంరెడ్డి, తలకొండపల్లి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు కటికల శేఖర్ ,మాజీ సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు గోపాల్ నాయక్ , కల్వకుర్తి తాలూకా గౌడ్ సంఘ కన్వీనర్ మాకురాల అశోక్ గౌడ్,ఆమనగల్ కౌన్సిలర్ ఆంజనేయులు, జగన్, రమేష్, విక్రమ్,శ్రీశేలం, ఉప సర్పంచ్ కోటేశ్వర్, కోనాపూర్ శేఖర్, కటికల శేఖర్, వినోద్, అమంగల్ యువకులు, తలకొండపల్లి నాయకులు తదితరులు పాల్గొన్నారు

## మలి దశ తెలంగాణ ఉద్యమ కారుడు మాజీ ఎమ్మెల్యే, నిబద్ధత కలిగిన నాయకుడు

**పెద్ది సుదర్శన్ రెడ్డి మరణ వార్త దిగ్భ్రాంతికి,గురిచేసింది పుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)





ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో ఆయన కోలుకుని తిరిగి ప్రజల మధ్యకు వస్తారనే ఆశతో ఎదురుచూశాం. కానీ, ఆయన ఇక మన మధ్య లేరన్న వార్త ఎంతో బాధాకరం. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో ఆయన పోషించిన పాత్ర చిరస్మరణీయం. ఉద్యమ ఆశయాలను విశ్వసిస్తూ, జీవితాంతం ప్రజల పక్షాన నిలబడి,పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేసిన నాయకుడిగా పెద్ది సుదర్శన్ రెడ్డి ఎప్పటికీ గుర్తుండిపోతారు. అని పుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు ఆయన మరణం భారత రాష్ట్ర సమితి పార్టీకి మాత్రమే కాదు, తెలంగాణ సమాజానికే తీరని లోటు. ఆయన చూపిన నిబద్ధత,ఉద్యమ స్ఫూర్తి, ప్రజాసేవ పట్ల ఉన్న అంకితభావం పార్టీ శ్రేణులకు,భావితరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి. పెద్ది సుదర్శన్ రెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు, పార్టీ కార్యకర్తలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

# మలి దశ తెలంగాణ ఉద్యమ కారుడు మాజీ ఎమ్మెల్యే కి నివాళులు

**పెద్దిరెడ్డి సుదర్శన్ రెడ్డి సేవలు చిరస్మరణీయం**
**మాజీ మండల అధ్యక్షుడు జోగయ్య**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

వెల్దండ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుడు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలంగాణ ఉద్యమకారులు మాజీ మండల అధ్యక్షుడు కానుగుల జోగయ్య పేర్కొన్నారు. శ్రీశైలం--హైదరాబాద్ జాతీయ రహదారిపై ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద వెల్దండ మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జంగిలి నిరంజన్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి చేసిన త్యాగాలు, పోరాట పటిమ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం అనేక కష్టనష్టాలను భరిస్తూ ఉద్యమాన్ని ముందుండి నడిపించిన నాయకుల్లో ఆయన ఒకరని కొనియాడారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షల సాధన కోసం ఆయన చేసిన సేవలను ఎప్పటికీ మరువలేమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు



పాల్గొని పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమం అనంతరం తెలంగాణ ఉద్యమంలో ఆయన చేసిన విశిష్ట సేవలను నాయకులు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సింగం విజయ్ గౌడ్, కానుగుల జోగయ్య, మొక్తల శేఖర్ ముదిరాజ్, పోలే అశోక్ కుమార్, గుద్దటి ప్రభాకర్, ధ్యాప ఆనంద్ రెడ్డి,లింగం ముదిరాజ్,జంగిలి యాదగిరి,డీలర్ వెంకటయ్య,గోరటి అశోక్, లక్ష్మారెడ్డి లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# మినీ స్టేడియం నిర్మాణానికి 1కోటి 30 లక్షల నిధులతో శ్రీకారం

**ఆగస్టు 3న స్టేడియం అభివృద్ధి పనులను ప్రారంభించనున్న ఎమ్మెల్యే కసిరెడ్డి**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కల్వకుర్తి ప్రాంత క్రీడాకారులకు ఎంతో కాలంగా ఉన్న కల నేడు తెలంగాణ రాష్ట్రంలోని ప్రజా పాలనలో నెరవేరబోతోందని కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లా క్రీడలు యువజన శాఖ అధికారి సీతారాం నాయక్ తో కలిసి కల్వకుర్తి మినీ స్టేడియాన్ని మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ మాట్లాడుతూ పదేళ్ల పాటు అభివృద్ధికి నోచుకోని కల్వకుర్తి మినీ స్టేడియం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక చొరవతో మంజూరైన 1కోటి 30లక్షల నిధులతో త్వరలోనే ఆధునిక సౌకర్యాలతో కొత్త రూపు సంతరించుకోనుందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కల్వకుర్తి మినీ స్టేడియం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని క్రీడాకారులకు కనీస మౌలిక సదుపాయాలు కూడా లేకపోవడంతో యువత తమ ప్రతిభను నిరూపించుకునేందుకు తగిన వేదిక లేక ఇబ్బందులు పడ్డారని జిల్లా,రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లాలంటే ఇతర ప్రాంతాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉండేదని పేర్కొన్నారు. కల్వకుర్తి మినీ స్టేడియం అభివృద్ధి సమస్యకు చరమగీతం పాడేందుకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సూచన మేరకు కల్వకుర్తి మినీ స్టేడియం అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం 1 కోటి 30 లక్షల నిధులను మంజూరు చేసిందని ఈ నిధులతో స్టేడియంలో 400 మీటర్ల అథ్లెటిక్ ట్రాక్, ప్రహరీ గోడ నిర్మాణం,ఫ్లడ్ లైట్లు, డ్రెస్సింగ్ రూంలు, తాగునీటి సౌకర్యం,క్రీడా పరికరాల గది తదితర ఆధునిక సదుపాయాలు కల్పించనున్నట్లు ఈ సందర్భంగా ఆమె తెలిపారు. ఆగస్టు 3న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అభివృద్ధి పనులకు శంకుస్థాపన... కల్వకుర్తి మినీ స్టేడియం అభివృద్ధి పనులకు ఆగస్టు 3న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి భూమి పూజ చేసి శంకుస్థాపన చేయనున్నట్లు కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ తెలిపారు. క్రీడల అభివృద్ధే లక్ష్యంగా కల్వకుర్తి మినీ స్టేడియం అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి స్టేడియాన్ని క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆమె అధికారులను ఆదేశించారు.

**క్రీడాకారుల్లో ఆనందం...**

కల్వకుర్తి మినీ స్టేడియం అభివృద్ధి పనులకు నోచుకోవడంతో కల్వకుర్తి, చుట్టుపక్కల మండలాలకు చెందిన



క్రీడాకారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కల్వకుర్తి మినీ స్టేడియంలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు కల్వకుర్తి ప్రాంతం నుండి వెలువడే అవకాశం ఉందని యువత ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్ పర్సన్ వెంట మున్సిపాలిటీ కౌన్సిలర్లు షేక్ ఏజాస్, కొల్లోజు రాజేష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పుస్తకాల రాహుల్,ఏఈ సంతోష్ కుమార్, ఫుట్ బాల్ శిక్షకుడు వెంకటరాములు, గుత్తేదారు ప్రవీణ్ కుమార్,క్రికెట్ అసోసియేషన్ సభ్యులు సుధాకర్,నవీన్,సీనియర్ క్రీడాకారులు జహీర్,మహేష్ రెడ్డి,చెన్నకేశవులు,భాను, యువజన కాంగ్రెస్ నాయకులు అఖిల్, పడకంటి వెంకటేష్, దున్న సురేష్,నవీన్, తదితరులు ఉన్నారు.

# ఉద్యోగ విరమణ పొందిన ఏఎస్ఐ కొంకటి సంజీవ్‌కు ఘన సన్మానం

**ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు**

అగ్నిధార న్యూస్,(రామగుండం):

రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ పరిధిలోని గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఎస్ఐ)గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన కొంకటి సంజీవ్కు ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో ఉద్యోగ విరమణ ఒక సహజమైన ఘట్టమని పేర్కొన్నారు. పోలీసు శాఖలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం కొంకటి సంజీవ్ ఎన్నో సంవత్సరాల పాటు అంకితభావంతో సేవలందించారని కొనియాడారు. ఆయన నిజాయితీ, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి సహచరులతో పాటు ప్రజల అభిమానాన్ని పొందారని అన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా ఆరోగ్యంగా, ఆనందంగా కుటుంబ సభ్యులతో సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. ఆయన చేసిన సేవలు పోలీసు శాఖకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో






ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్, ఆలయ ఫౌండేషన్ ప్రతినిధి మిట్టపల్లి రాజేందర్ కుమార్, పానుగంటి రాయలింగు, కొంకటి కనకరాజ్, కొంకటి సిద్ధార్థతో పాటు సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# లోతట్టు ప్రాంతాల వరద ముప్పుకు అధికారుల నిర్లక్ష్యమే కారణం

**గొల్లగూడెం--చెరుకూరు వంతెనను వెంటనే పూర్తి చేయాలి**
**: ప్రజా పోరాట సమితి అధ్యక్షుడు ముత్తేబోయిన మహేందర్**

అగ్నిధార న్యూస్,(రామగుండం):



గోదావరి వరదలతో లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు కేవలం పరిశీలనకే పరిమితమవుతున్నారని ప్రజా పోరాట సమితి అధ్యక్షుడు ముత్తేబోయిన మహేందర్ విమర్శించారు. గొల్లగూడెం--చెరుకూరు గ్రామాల మధ్య నిలిచిపోయిన వంతెన నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, గొల్లగూడెం--చెరుకూరు మధ్య వంతెన నిర్మాణం నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా సాగుతోందని ఆరోపించారు. రహదారి, వంతెన నిర్మాణానికి కేటాయించిన నిధుల వినియోగంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. వంతెన నిర్మాణం సకాలంలో పూర్తికాకపోవడం వల్లే వరదల సమయంలో రాకపోకలు నిలిచిపోయి ప్రజలు జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నారని అన్నారు. వరద పరిస్థితులను ఆసరాగా చేసుకుని నాటు పడవల నిర్వాహకులు ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. బైక్‌కు రూ.100, ఒక్కో వ్యక్తికి రూ.50 చొప్పున వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజలకు, విద్యార్థులకు, రైతులకు 24 గంటల ఉచిత, సురక్షిత పడవ రవాణా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కేవలం ఫొటోషూట్లకే పరిమితం కాకుండా ముంపు గ్రామాల్లో నిత్యావసర సరుకులు, తాగునీరు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి బాధితులను ఆదుకోవాలని కోరారు. గొల్లగూడెం--చెరుకూరు వంతెన నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయకపోతే బాధితులు, ప్రజా సంఘాలతో కలిసి ప్రభుత్వంపై పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని ముత్తేబోయిన మహేందర్ హెచ్చరించారు.

ఈ ప్రకటనలో తోట రవి, కుమ్మరి శ్రీనాథ్, గగ్గూరి నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్జీ-1లో వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలన



**2ఏ ఇంక్లైన్ అండర్‌బ్రిడ్జి ప్రధాన కాలువను ఆధునీకరిస్తాం**
**: జీఎం లలిత్ కుమార్**

అగ్నిధార న్యూస్,(రామగుండం):

సింగరేణి ఆర్జీ-1 ఏరియాలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో నీట మునిగిన ప్రాంతాలను శుక్రవారం ఆర్జీ-1 జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ పరిశీలించారు. ఉదయ్‌నగర్, 2ఏ ఇంక్లైన్ రైల్వే అండర్‌బ్రిడ్జి ప్రాంతాల్లో ఏర్పడిన సమస్యలను అధికారులు, ఏఐటీయూసీ నాయకులతో కలిసి పరిశీలించి బాధిత కార్మిక కుటుంబాలతో మాట్లాడారు. ఈ సందర్భంగా జీఎం లలిత్ కుమార్ మాట్లాడుతూ, 2ఏ ఇంక్లైన్ రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద ఉన్న ప్రధాన కాలువను ఆధునీకరించడంతో పాటు కంపెనీ క్వార్టర్లలోని డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. వర్షపు నీరు, మురుగు నీరు నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆర్జీ-1 బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను మాట్లాడుతూ, 2ఏ ఇంక్లైన్ రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద ప్రధాన కాలువలో వరద ప్రవాహం సరిగా వెళ్లకపోవడం, క్వార్టర్లలో మురుగు నీరు నిలిచిపోవడంతో కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఈ సమస్యపై ఏఐటీయూసీ చేసిన విజ్ఞప్తి మేరకు జీఎం స్పందించి సంబంధిత ప్రాంతాలను పరిశీలించడం సంతోషకరమన్నారు. ఆర్జీ-1 పరిధిలోని సెక్టార్-1, సెక్టార్-2 కంపెనీ క్వార్టర్లలో ఉన్న డ్రైనేజీ వ్యవస్థ సుమారు 30 సంవత్సరాల క్రితం నిర్మించబడిందని, పందికొక్కుల కారణంగా భూగర్భ పైపులు దెబ్బతిని మురుగు నీరు బయటకు వస్తోందని ఆయన వివరించారు. దీంతో దుర్వాసన వ్యాపించి కార్మిక కుటుంబాలు తీవ్ర అవస్థలు పడుతున్నాయని పేర్కొన్నారు. ప్రధాన కాలువ ఆధునీకరణతో పాటు సెక్టార్-1, సెక్టార్-2 క్వార్టర్ల డ్రైనేజీ వ్యవస్థను పూర్తిస్థాయిలో ఆధునీకరించి, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని ఏఐటీయూసీ నాయకులు సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. ఈ పరిశీలనలో సివిల్ డీజీఎం వరప్రసాద్, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, ఏఐటీయూసీ నాయకులు పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్నతో పాటు వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కూల్చివేతల పర్వం కాదు.. నిర్మాణాల పర్వం కావాలి

**ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీయొద్దు : బీజేపీ రామగుండం ఇంచార్జి కందుల సంధ్యారాణి**

అగ్నిధార న్యూస్,( రామగుండం):

రామగుండం నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కంటే కూల్చివేతలే ఎక్కువగా కనిపిస్తున్నాయని బీజేపీ రామగుండం ఇంచార్జి కందుల సంధ్యారాణి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, ఎమ్మెల్యే ఎన్నికై దాదాపు మూడు సంవత్సరాలు పూర్తవుతున్నా ప్రజలకు చెప్పుకోదగ్గ నిర్మాణాత్మక అభివృద్ధి కనిపించడం లేదని విమర్శించారు.

శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, తిలక్‌నగర్‌లోని దుకాణాలను కూల్చివేసి లబ్ధిదారుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసి కొత్త నిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చినా, ఇప్పటికీ పనులు పూర్తి కాలేదన్నారు. మధ్యలో ఏం జరిగిందో తెలియదుగానీ, తాజాగా సింగరేణి అధికారులు నిర్మించిన షట్టర్లను కూల్చివేయడం అనేక అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. ప్రజల సొమ్ము, ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అవుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. దుకాణాల కూల్చివేతలతో పలువురు కుటుంబాల ఉపాధి దెబ్బతింటోందని, ప్రజల జీవితాలపై బాధ్యత వహించాల్సిన ప్రజాప్రతినిధులు సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు. కూల్చివేయడం పరిపాలన కాదని, నిర్మాణాలు చేపట్టి ప్రజలకు మేలు చేయడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉండాలని అన్నారు. ఇలాగే కూల్చివేతలు కొనసాగితే కాంగ్రెస్ పార్టీపై ప్రజల విశ్వాసం దెబ్బతింటుందని హెచ్చరించారు. అవసరమైతే బాధితుల తరఫున ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని స్పష్టం చేశారు. నష్టపోయిన లబ్ధిదారులకు వెంటనే న్యాయం చేసి, హామీ ఇచ్చిన నిర్మాణాలను ఆలస్యం లేకుండా పూర్తి చేసి అప్పగించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సులువలక్ష్మీ నరసయ్య, మండల అధ్యక్షురాలు ఊరగొండ అపర్ణ, గుండబోయిన భూమయ్య, జక్కుల పద్మ, బూడిద హర్ష, ఆకునూరి తిరుమల, వీరబోయిన శ్రీనివాస్, కుర్ర రాజేందర్, పంగ రవి, జక్కుల ప్రవీణ్, కొట్టే నరేష్, హనుమాన్ల వెంకటేష్, మీస వికాస్, తిరుపతి, అరవింద్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.



# ఆర్జీ-1లో వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలన

**2ఏ ఇంక్లైన్ అండర్‌బ్రిడ్జి ప్రధాన కాలువను ఆధునీకరిస్తాం**
**: జీఎం లలిత్ కుమార్**

అగ్నిధార న్యూస్,(రామగుండం):

సింగరేణి ఆర్జీ-1 ఏరియాలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో నీట మునిగిన ప్రాంతాలను శుక్రవారం ఆర్జీ-1 జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ పరిశీలించారు. ఉదయ్‌నగర్, 2ఏ ఇంక్లైన్ రైల్వే అండర్‌బ్రిడ్జి ప్రాంతాల్లో ఏర్పడిన సమస్యలను అధికారులు, ఏఐటీయూసీ నాయకులతో కలిసి పరిశీలించి బాధిత కార్మిక కుటుంబాలతో మాట్లాడారు. ఈ సందర్భంగా జీఎం లలిత్ కుమార్ మాట్లాడుతూ, 2ఏ ఇంక్లైన్ రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద ఉన్న ప్రధాన కాలువను ఆధునీకరించడంతో పాటు కంపెనీ క్వార్టర్లలోని డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. వర్షపు నీరు, మురుగు నీరు నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆర్జీ-1 బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను మాట్లాడుతూ, 2ఏ ఇంక్లైన్ రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద ప్రధాన



కాలువలో వరద ప్రవాహం సరిగా వెళ్లకపోవడం, క్వార్టర్లలో మురుగు నీరు నిలిచిపోవడంతో కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఈ సమస్యపై ఏఐటీయూసీ చేసిన విజ్ఞప్తి మేరకు జీఎం స్పందించి సంబంధిత ప్రాంతాలను పరిశీలించడం సంతోషకరమన్నారు. ఆర్జీ-1 పరిధిలోని సెక్టార్-1, సెక్టార్-2 కంపెనీ క్వార్టర్లలో ఉన్న డ్రైనేజీ వ్యవస్థ సుమారు 30 సంవత్సరాల క్రితం నిర్మించబడిందని, పందికొక్కుల కారణంగా భూగర్భ పైపులు దెబ్బతిని మురుగు నీరు బయటకు వస్తోందని ఆయన వివరించారు. దీంతో దుర్వాసన వ్యాపించి కార్మిక కుటుంబాలు తీవ్ర అవస్థలు పడుతున్నాయని పేర్కొన్నారు. ప్రధాన కాలువ ఆధునీకరణతో పాటు సెక్టార్-1, సెక్టార్-2 క్వార్టర్ల డ్రైనేజీ వ్యవస్థను పూర్తిస్థాయిలో ఆధునీకరించి, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని ఏఐటీయూసీ నాయకులు సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. ఈ పరిశీలనలో సివిల్ డీజీఎం వరప్రసాద్, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, ఏఐటీయూసీ నాయకులు పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్నతో పాటు వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉచిత కంటి శిబిరంలో 72 మందికి పరీక్షలు

**38 మందిని శస్త్రచికిత్స కోసం రేకుర్తికి తరలింపు**

**అగ్ని ధార న్యూస్,(రామగుండం):**

గోదావరిఖని పట్టణంలోని కళ్యాణ్‌నగర్ 52వ డివిజన్‌లోని రాజస్థాన్ భవన్‌లో లైన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని ఆధ్వర్యంలో, కరీంనగర్ రేకుర్తి కంటి ఆసుపత్రి సౌజన్యంతో శుక్రవారం ఉచిత కంటి పరీక్షలు, శస్త్రచికిత్సల ఎంపిక శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి స్థానిక ప్రజలు విశేషంగా స్పందించారు. శిబిరంలో మొత్తం 72 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో 38 మందికి కంటి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు నిర్ధారించారు. వారిని ప్రత్యేక బస్సులో రేకుర్తి కంటి ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వారికి బీపీ, మధుమేహం తదితర ఆరోగ్య సమస్యలు ఉండటంతో ఈ విడతలో శస్త్రచికిత్సకు పంపలేదని, వారి ఆరోగ్య పరిస్థితి అనుకూలించిన తర్వాత నిర్వహించే తదుపరి శిబిరంలో తరలిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో 52వ




డివిజన్ కార్పొరేటర్ చిద్రల నాగరాజు, లైన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని అధ్యక్షుడు చిట్టిమల కిషోర్, కార్యదర్శి అల్లాడి నాగరాజు, కోశాధికారి చింతకింది కృష్ణ, లీయో టు లయన్స్ కోఆర్డినేటర్ నార్ల ప్రసాద్, జోన్ చైర్మన్ కొమరవెల్లి సుధాకర్, లక్ష్మీవాణి, లైన్స్ క్లబ్ ఆఫ్ లక్ష్మీనగర్ అధ్యక్షుడు అనఘం కృష్ణమూర్తి, డీసీ విజన్ కోఆర్డినేటర్ చందర్ గుప్తా, డీసీ ఐ క్యాంప్స్ స్క్రీనింగ్ కోఆర్డినేటర్ మామిడిపల్లి శ్రీధర్, లైన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని స్ఫూర్తి అధ్యక్షుడు కోదాటి ప్రవీణ్, లైన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని వాసవి అధ్యక్షుడు కొమరవెల్లి రాహుల్‌తో పాటు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, నిరుపేదలకు ఉచిత నేత్ర వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఇటువంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు.

# నంచర్లలో డిప్యూటీ కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు





**గురుకుల పాఠశాల సమస్యలపై ఆరా -- విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశం**

**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్:**

మహమ్మదాబాద్ మండలం నంచర్ల గ్రామంలో డిప్యూటీ కలెక్టర్ మధుసూదన్ నాయక్ శుక్రవారం ఆకస్మికంగా పర్యటించి ప్రభుత్వ శాఖల పనితీరును పరిశీలించారు. ముందుగా మిషన్ భగీరథలో పనిచేస్తున్న కార్మికుల హాజరు నమోదును తనిఖీ చేసి, ఆధార్ కార్డులను పరిశీలిస్తూ విధుల్లో పారదర్శకత ఉండాలని అధికారులకు సూచించారు. అనంతరం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించిన ఆయన పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా ముచ్చటించారు. వారి చదువు, పరీక్షల సన్నద్ధత, భవిష్యత్ లక్ష్యాల గురించి అడిగి తెలుసుకుని సుమారు 30 నిమిషాల పాటు చదువులో క్రమశిక్షణ, సమయపాలన, ఆత్మవిశ్వాసం ఉంటే ఉన్నత విజయాలు సాధించవచ్చని విద్యార్థులకు ప్రేరణాత్మకంగా వివరించారు. ఈ సందర్భంగా పాఠశాలలో తాగునీటి సమస్యపై సర్పంచ్ ఎస్ గాయత్రి దేవి ప్రిన్సిపాల్ రమ డిప్యూటీ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. బోరు తవ్వేందుకు అనుమతి ఉన్నప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. దీనిపై స్పందించిన డిప్యూటీ కలెక్టర్ సమస్యను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తదుపరి భోజనశాలను తనిఖీ చేసిన ఆయన పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వంటగదిలోకి చెప్పులు ధరించి ఎవరూ ప్రవేశించరాదని, ఆహార భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సిబ్బందికి సూచనలు చేశారు. ఈ తనిఖీల్లో ఎంపీడీవో నరేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ ఎస్. గాయత్రి దేవి, గ్రామ కార్యదర్శి శ్యాం, వార్డు సభ్యుడు చిన్నారెడ్డి, గ్రామ పెద్దలు తిరుమలరెడ్డి, గాండ్ల పార్వతయ్య, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి



**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

జగదేవపూర్ మండలం నిర్మల్ నగర్ గ్రామానికి చెందిన ఎర్ర ప్రభాకర్ ఇంట్లో గత 20రోజుల క్రితం గ్యాస్ లికేజి ప్రమాదంలో కుటుంబ సభ్యులు అందరు తీవ్రంగా గాయపడ్డారు హాస్పిటల్ చేరి చికిత్స పొందారు శుక్రవారం వారి కుటుంబ సభ్యులను బిఆర్ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. వారి వెంట స్థానిక పాక్స్ చైర్మన్ ఇంద్ర సేన రెడ్డి కొండపోచమ్మ మాజీ చైర్మన్ ఉపేందర్ రెడ్డి తీగుల్ మాజీ సర్పంచ్ బట్టు సుధాకర్ రెడ్డి అలీరాజ్ పేట్ సర్పంచ్ రాచమల్ల ఎల్లేష్ నిర్మల్ నగర్ ఉప సర్పంచ్ యాదగిరి పాక్స్ డైరెక్టర్ భూమయ్య మాజీ సర్పంచ్ లు చంద్ర శేఖర్ కృష్ణ అంకిల్లా యాదవ రెడ్డి రాజు మాజీ ఎంపీటీసీ కిరణ్ గౌడ్ బిఆర్ఎస్ నాయకులు మధుసూదన్ బాపు రెడ్డి వెంకట్ గౌడ్ నారాయణ సాయిలు నర్సిములు నరేష్ అశోక్ సురేష్ వెంకట్ మహేష్ రెడ్డి కరుణాకర్ రెడ్డి మహేందర్ రెడ్డిసుధాకర్ మహేందర్ శ్రీను తిరుపతి రాజు తదితరులు ఉన్నారు.

## ఇటిక్యాల బాధితరైతులకు న్యాయం చేయాలి

**20సంవత్సరాల క్రితం ఇచ్చిన భూమిని తిరిగి తీసుకోవడం అన్యాయం**

**సర్పంచ్ నర్సొళ్ల దిన రాజలింగం**

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**




జగదేవపూర్ మండలం ఇటిక్యాల గ్రామంలో 2005 లో ప్రభుత్వం పేద రైతులకు పంచిన భూమిని తిరిగి తీసుకుంటుందని బాధితులకు న్యాయం చేయాలనీ జిల్లా కలెక్టర్ కార్యాలయం పరిపాలన అధికారికి నర్సొళ్ల దినరాజలింగం తిమ్మాపూర్ సర్పంచ్ పోసానిపల్లి రాజు వార్డు నెంబర్ తుమ్మ బాబు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ సర్వేనెంబర్ 272 లో ఒక ఎకరం చొప్పున సుమారు 250 మంది రైతులకు భూమిని పంచింది. పట్టా సర్టిఫికెట్లు పాసుబుక్కులు ప్రొసీడింగ్స్ ప్రభుత్వం ఇవ్వడం జరిగింది .20 సంవత్సరాల క్రితం ఇచ్చిన భూమిని పేద రైతుల దగ్గర నుండి అన్యాయం తీసుకోవడం జరుగుతుంది. గ్రామంలో భూమిలేని పేదలకు ఇచ్చిన భూమిని తిరిగి ప్రభుత్వం ఎలాంటి న్యాయం చేయకుండా తీసుకోవడం ఇది హేయమైన చర్య ప్రభుత్వ స్పందించి పేద రైతులందరికీ ఆదుకొని వారికి తగిన న్యాయం చేయాలని కోరారు.

## సురక్షితమైన ఆహార వ్యవస్థను వినియోగదారులకు అందించేందుకు కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీలు

**ఉద్యాన విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ డి. రాజి రెడ్డి**

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

గజ్వేల్ నియోజకవర్గం ములుగు మండలం రోజురోజుకు పెరుగుతున్న పురుగుమందు అవశేషాల నేపథ్యంలో సురక్షితమైన ఆహార వ్యవస్థను వినియోగదారులకు అందించేందుకుగాను కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీలు అందుబాటులోకి తీసుకురావాలని, అలాగే పురుగు తెగుళ్ల యాజమాన్యంలో సుస్థిర పద్ధతులపై పరిశోధన ముమ్మరం చేయాలని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ రాజి రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ లోని ఉద్యాన కళాశాల వేదికగా జరిగిన సుస్థిర పురుగు తెగుళ్ల యాజమాన్య పద్ధతుల పై జరిగిన వర్క్ షాప్ కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ముమ్మరంగా సాగవుతున్న ఆయిల్ పామ్ యాజమాన్యం లో సైతం భవిష్యత్తులో జీవన ఆధారిత సమగ్ర యాజమాన్య పద్ధతులతో పురుగు, తెగుళ్ల ను కట్టడి చేయాలని ఆయన అన్నారు. మామిడిలో తామర పురుగు, జామలో పిండి నల్లి, టమాటాలో సూది పురుగు, వంకాయలో కాయ, కొమ్మ తోలుచు పురుగు యాజమాన్యానికై జరిగిన పరిశోధన ఆవిష్కరణలను త్వరలోనే రైతులకు అందజేస్తామని అన్నారు. భవిష్యత్తులో రసాయనేతర యాజమాన్య పద్ధతులు రైతులకు అందుబాటులో తెచ్చేందుకు పరిశోధనలు చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ పరిశోధనా సంచాలకులు డాక్టర్ డి లక్ష్మీనారాయణ, డీన్ డా.జే. చీనా, పీజీ డీన్ డాక్టర్ టి. సురేష్, ఏ టి జి సి బయోటిక్ గ్లోబల్ ఎండి రోనాల్డ్, ఇండియన్ ఎండి మార్కండేయ, కో ఫౌండర్ డాక్టర్ వి. భాస్కర్ రెడ్డి, డైరెక్టర్ ప్లానింగ్ అండ్ మానిటరింగ్ అనిత కుమారి, అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రశాంత్, శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన డాక్యుమెంట్ రైటింగ్ ఆఫీస్‌ను ప్రారంభించిన తూంకుంట ఆంక్ష రెడ్డి

**అగ్నిధార న్యూస్, జగదేవపూర్:**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం జగదేవపూర్ మండల కేంద్రంలోని ఎమ్.ఆర్.ఓ ఆఫీస్ వద్ద కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఎమ్.డి. ఆరిఫ్ ఏర్పాటు చేసిన నూతన డాక్యుమెంట్ ఆఫీస్‌ను సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్ష రెడ్డి చేతుల మీదుగా వైభవంగా ప్రారంభించారు.?ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగదేవపూర్ మండల పరిసర ప్రాంత ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉంటూ, సరసమైన ధరలకే నాణ్యమైన డాక్యుమెంట్ రైటింగ్ సేవలు అందించాలని నిర్వాహకులు ఎమ్.డి. ఆరిఫ్‌కు సూచించారు. అదేవిధంగా ఎమ్.ఆర్.ఓ ఆఫీస్‌కు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారికి అవసరమైన ప్రభుత్వ సేవలు రిజిస్ట్రేషన్ పత్రాల తయారీలో సహాయపడాలని కోరారు. ఈ కార్యకర్తలు వ్యాపార రంగంలోనూ, స్వయం ఉపాధిలోనూ ముందంజలో ఉండడం అభినందనీయమని పేర్కొంటూ ఆరిఫ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.?ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంపల్లి కరుణాకర్ గాల్ రెడ్డి గుబ్బ శ్రీనివాస్ గుప్తా దయాకర్ రెడ్డి అమర రాము అయూబ్ ఎండీ అజీజ్ వార్డు నెంబర్ ఆంజనేయులు సురేష్ ఎండీ బాబు కార్యకర్తలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## జనరల్ బాడీ సమావేశంలో అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు




**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

మాడ్గుల మండల రైతు వేదికలో శుక్రవారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న సర్పంచులు, ప్రజాప్రతినిధులు వివిధ గ్రామాలకు సంబంధించిన సమస్యలు, అభివృద్ధి అవసరాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటిపై స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత శాఖల అధికారులకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని, తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, విద్యుత్, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని అధికారులకు సూచించారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే మండల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో మండల ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీపీ, ఎంపీడీఓ, తహసీల్దార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఓబిసి 11వ మహాసభకు చలో పోస్టర్ ఆవిష్కరణ



**బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు డ్యాగ అనిల్ కుమార్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి పట్టణ కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గౌడుగు భాను చందర్ ఆధ్వర్యంలో ఆగస్టు 7, 2026న జాజుల శ్రీనివాస్ నాయకత్వంలో జరగబోయే అఖిల భారత ఓబిసి మహాసభను బెంగళూరులో నిర్వహించనున్న అఖిల భారత జాతీయ ఓబీసీ 11వ మహాసభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఘనంగా విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు డ్యాగ అనిల్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బీసీల హక్కుల పరిరక్షణ,జనాభా ప్రాతిపదికన హక్కులు,బీసీ కులగణన,విద్య, ఉద్యోగాలు,రాజకీయ రంగాల్లో సముచిత ప్రాతినిధ్యం వంటి కీలక అంశాల సాధన కోసం నిర్వహిస్తున్న ఈ మహాసభను ప్రతి బీసీ బంధువు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సుధాకర్,పుట్ట వెంకయ్య, రామస్వామి,పర్వతాపురం గణేష్, చంద్రమౌళి, జంగయ్య,చిన్న గౌడ్,కొంక అరవింద్ గౌడ్,శివకృష్ణ, ఇస్లావత్ శివ,కావాలి కుమార్,హనుమంత్ శేఖర్,వీరభద్ర,గంగపురం తిరుమలేష్,బిసి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి భారత పౌరుడికి ఓటు హక్కు కల్పించాలి: బిజెపి రాష్ట్ర నాయకుడు శరత్ కుమార్ రెడ్డి

**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్:**

ప్రతి భారత పౌరుడు తన ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని, అందుకు ప్రతి ఒక్కరూ బీఎల్ఓలకు సహకరించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు శరత్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మహమ్మదాబాద్ మండలంలో నిర్వహించిన మండల ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా ఆయన సుడిగాలి పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించిన శరత్ కుమార్ రెడ్డి, బీఎల్ఏ-2 ప్రతినిధులతో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక పరిశీలన కార్యక్రమాన్ని సమీక్షించారు. హైదరాబాద్‌లో ఉన్నా, మహారాష్ట్రలో ఉన్నా లేదా ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న వారైనా తమ స్వగ్రామంలోని బీఎల్ఓను సంప్రదించి ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. దేశంలోని ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన అన్నారు.

ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేయడం, అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియలో ప్రజలు చురుకుగా పాల్గొని ఎన్నికల సంఘానికి సహకరించాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఓటు విలువైనదని, అర్హులందరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కుర్వ కృష్ణ, జిల్లా నాయకుడు ప్రభు నాయక్, మండల ప్రధాన కార్యదర్శి బోయిని కాశీనాథ్, పవన్ కుమార్, ఈశ్వర్, హరీష్ నాయక్, వార్డు సభ్యులు, బూత్ అధ్యక్షులు రాజు, ఆంజనేయులు, అనిల్‌తో పాటు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## దౌలాపూర్ లో సర్పంచ్ కుకునూరి కృష్ణ ఆధ్వర్యంలో 'డ్రై డే' కార్యక్రమం

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట**



జిల్లా జగదేవపూర్ మండలం ?దౌలాపూర్ గ్రామంలో సర్పంచ్ కుకునూరి కృష్ణ ఆధ్వర్యంలో 'డ్రై డే' పరిశుభ్రత నీటి నిల్వల తొలగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షాకాలం సీజనల్ వ్యాధులు, దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి రోగాలు రాకుండా ముందస్తు జాగ్రత్తగా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్బంగా సర్పంచ్ కృష్ణ మాట్లాడుతూ ?అవగాహన పరిసరాల పరిశుభ్రత ప్రతి ఇంటా నీరు నిల్వ ఉండే కుండలు, పూల తొట్లు, పాత టైర్లు, ఎయిర్ కూలర్లలోని పాత నీటిని తొలగించి, ఆ పాత్రలను ఆరబెట్టాలని సర్పంచ్ గ్రామస్తులకు సూచించారు.?డ్రైనేజీలు బ్లీచింగ్: గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి వీధులు, డ్రైనేజీలను శుభ్రం చేయించి, వ్యాధులు క్రమంగా విస్తరించకుండా బ్లీచింగ్ పౌడర్, దోమల మందు పిచికారీ చేయించారు.?ప్రజా భాగస్వామ్యం: పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ 'డ్రై డే' పాటిస్తూ పరిశుభ్రతలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.?ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి ఐల్లయ్య ఆశా వర్క వంటేరు పద్మావతి ఏఎన్ఎంలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికి ఇంకుడు గుంత ఉండాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో తప్పనిసరిగా సోక్‌పిట్‌లు ఏర్పాటు చేయాలి.**

**కాలానుగుణ వ్యాధుల నియంత్రణకు పారిశుద్ధ్య చర్యలు పకడ్బందీగా చేపట్టాలి.**

**పట్టణ పరిపాలనపై మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్.**

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి, జూలై-31:**

వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.

శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) అరుణ శ్రీ తో కలిసి మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన పట్టణ పరిపాలన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, జల శక్తి జన భాగిదారి కార్యక్రమంలో భాగంగా వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచేందుకు ప్రతి ఇంటిలో తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.అన్ని ప్రాంతాల్లో ఇకపై కొత్తగా నిర్మించే ప్రతి ఇంటికి ఇంకుడు గుంత (సోక్‌పిట్) తప్పనిసరిగా ఉండాలని, ఇంకుడు గుంత లేని ఇళ్లకు ఇంటి నంబర్, తాగునీటి నల్లా కనెక్షన్ మంజూరు చేయబోమని స్పష్టం చేశారు. కొత్తగా ఇళ్ల నిర్మాణం చేపట్టే ప్రతి ఒక్కరూ ఈ నిబంధనను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ఇప్పటికే నిర్మించబడిన ఇళ్లలో కూడా వీలైనంత మేర ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లోని ప్రతి వార్డు పరిధిలో వచ్చే నెల రోజుల్లో కనీసం 30 ఇంకుడు గుంతలు నిర్మించేలా వార్డు అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకొని కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో తప్పనిసరిగా సోక్‌పిట్‌లు ఏర్పాటు చేయాలని, వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాలానుగుణ వ్యాధుల నివారణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని, పట్టణాల్లో పారిశుద్ధ్య నిర్వహణను మరింత బలోపేతం చేయాలని సూచించారు. రహదారులపై ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని ఆదేశించారు. తాగునీటి నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షిస్తూ ప్రజలకు



సురక్షితమైన తాగునీరు అందేలా చూడాలని, ప్రజారోగ్యానికి భంగం కలిగించే పరిస్థితులు ఎక్కడా తలెత్తకుండా మున్సిపల్ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు వెంకటేష్, రమేష్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బి. జి వెంకటాపూర్ లో డ్రై డే -- ఫ్రైడే కార్యక్రమం



**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా,**

జగదేవపూర్ మండలం వెంకటాపూర్ బి.జి గ్రామపంచాయతీ పరిధిలో డ్రై డే ఫ్రై డే కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ పరమేశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించడం చారు.ఈ సందర్భంగా సర్పంచ్ చెక్కల పరమేశ్వర్ మాట్లాడుతూ ఆశ వర్కర్లు భాగంగా గ్రామంలోని వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి నీటి నిల్వ పాత్రలను పరిశీలించడం, దోమల నివారణ చర్యలపై అవగాహన కల్పించడం, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించడం, అలాగే వారానికి ఒకరోజు డ్రై డే పాటించి నీటి నిల్వ పాత్రలను పూర్తిగా ఖాళీ చేసి శుభ్రపరచాలని ప్రజలకు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాబు వార్డు సభ్యులు రవి, సుధాకర్, యాదగిరి, జి.పి.ఓ శ్రీనివాస్, ఆశా వర్కర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

మన ఊరు -- మన బాధ్యత అనే లక్ష్యంతో ప్రతి కుటుంబం పరిశుభ్రతను పాటించి, దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకొని, ఆరోగ్యవంతమైన గ్రామ నిర్మాణానికి సహకరించాలని గ్రామ ప్రజలను కోరారు.

# భారీ వర్షాలు.. ప్రజాసేవలో పోలీసులు...

**అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దు**

**రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ..**

**అత్యవసర పరిస్థితుల్లో 100కు డయల్ చేయండి.**

**పోలీస్ సహాయం పొందండి.**

**అగ్నిధారన్యూస్ ( పెద్దపల్లి జిల్లా )**

పెద్దపల్లి,మంచిర్యాల రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పోలీస్ శాఖ అప్రమత్తమయింది. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా క్షేత్రస్థాయిలో గస్తీ తిరుగుతూ సహాయ చర్యలు చేపట్టారు. రామగుండం పోలీస్ కమిషనర్ (సీపీ) అంబర్ కిషోర్ ఝూ ఆదేశాల మేరకు కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులు, సిబ్బంది 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలను అప్రమత్తం చేస్తూ సేవలందిస్తున్నారు.

**క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ.**

జిల్లాలో లోతట్టు ప్రాంతాలు, ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలను నిరంతరం పోలీస్ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. జిల్లా ప్రజల రక్షణే ప్రథమ కర్తవ్యంగా వరద ప్రభావిత ప్రాంతాల గ్రామాల ప్రజల పైన ప్రత్యేక దృష్టి సారించారు.

**రవాణా నియంత్రణ.**



జిల్లాలో ఉధృత వరద నీటితో ప్రమాదకరంగా మారిన రోడ్లు, అండర్ రైల్వే బ్రిడ్జిలు బ్రిడ్జీల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి, ట్రాఫిక్‌ను మళ్లించాలి.

**సహాయక చర్యల్లో పోలీసులు.**

సీపీ ఆదేశాలతో రంగంలోకి దిగిన పోలీస్ సిబ్బంది భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా రోడ్లపైకి వచ్చి ప్రజలకు బాసటగా నిలిచారు. ప్రమాదకరమైన జలపాతాలు, చెరువుల వద్దకు ప్రజలు వెళ్లకుండా అప్రమత్తం చేశారు.

**ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి.**

జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రాకూడదని పోలీసులు సూచించారు. ఏ విధమైన అత్యవసర సహాయం కావాలన్నా తక్షణమే డయల్ 100 లేదా, స్థానిక పోలీస్ అధికారులను సంప్రదించాలని రామగుండం కమిషనరేట్ పోలీసులు కోరారు.

## ఒక వైపు రాయలసీమ... మరో వైపు ఉత్తరాంధ్ర...

## అంతు చిక్కని జగన్ వ్యూహం

**విజయవాడ :** ప్రాంతీయ సెంటిమెంట్లను రగిల్చి రాజకీయ ప్రయోజనం పొందాలనుకోవడం ప్రజాస్వామ్యంలో కొత్తేమీ కాదు. అయితే, ఒకే రాజకీయాధికారం కోసం ఒకే పార్టీ ఒకే సమయంలో వేర్వేరు ప్రాంతాల్లో భిన్నమైన, వివాదాస్పదమైన డిమాండ్లను తెరపైకి తెచ్చే వ్యూహాలు అరుదుగా కనిపిస్తాయి. వైఎస్సార్‌సీపీ ప్రస్తుతం అమలు చేస్తున్నట్లుగా భావిస్తున్న వ్యూహం సరిగ్గా ఈ తరహాకే చెందినది. ఒకవైపు రాయలసీమ అన్యాయం పేరుతో ప్రత్యేక రాష్ట్ర హోదా అనే నినాదాలను సజ్జల రామకృష్ణారెడ్డి వంటి నేతల ద్వారా ప్రోత్సహిస్తూ, మరోవైపు ఉత్తరాంధ్రలో ధర్మాన ప్రసాదరావు వంటి సీనియర్ నేతలతో ప్రత్యేక ఉత్తరాంధ్ర సెంటిమెంట్‌ను రగిలించే ప్రయత్నాలు చేస్తున్నారు.ప్రజల వాస్తవ అవసరాలు, వారి ఆలోచనా ధోరణితో సంబంధం లేకుండా కేవలం సొంత మీడియా, సోషల్ మీడియా నెట్‌వర్క్‌ల ద్వారా తమ అభిప్రాయాలను ప్రజలపై రుద్దవచ్చన్న ధీమా ఈ తరహా వ్యూహాలకు మూలధనం. సమాజంలో ప్రాంతీయ అసమానతలు ఉన్నప్పుడు వాటిని పరిష్కరించే సమగ్ర ప్రణాళికలు రూపొందించడం బాధ్యతాయుతమైన రాజకీయం అవుతుంది. కానీ, ప్రాంతాల మధ్య వైషమ్యాలను రగిల్చడం పొలిటికల్ ప్రాక్సీ డ్రామాను తలపిస్తోంది. ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టేస్తే తమకు రాజకీయంగా మేలు అనుకుంటున్నారు.ఈ తరహా ప్రాంతీయ విద్వేష వ్యూహం రాజకీయంగా తగలబెట్టేలా మారే ముప్పు ఎక్కువ. 2019-2024 మధ్య కాలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు రాజధానుల ప్రయోగం దీనికి ప్రత్యక్ష నిదర్శనం. పరిపాలనా వికేంద్రీకరణ అనే ఆకర్షణీయమైన పదబంధం వెనుక అమరావతి, విశాఖపట్నం, కర్నూలు ప్రాంతాల మధ్య ప్రాంతీయ విభజనలను రగిల్చారనే భావన ప్రజల్లో బలంగా నాటుకుంది. ఫలితంగా, ఏ ఒక్క ప్రాంతంలోనూ వైఎస్సార్‌సీపీకి స్పష్టమైన విశ్వసనీయత దక్కకపోగా, 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీ ఘోర పరాజయాన్ని మూటగట్టుకోవాల్సి వచ్చింది.ఒకసారి దెబ్బతిన్న వ్యూహాన్నే మళ్లీ కొత్త సీసాలో పాత మద్యంలా మార్చి ప్రయోగించడం పార్టీ భవిష్యత్తుకే ప్రమాదకరం. తమపై తామే పెట్రోల్ పోసుకుని నిప్పు అంటించుకోవడం లాంటి ఈ తీరు వల్ల గతంలో వచ్చిన చేదు అనుభవాల నుంచి నాయకత్వం పాఠాలు నేర్చుకోలేదనే సంకేతం ప్రజల్లోకి వెళ్తుంది. మూడు రాజధానుల అంశంపై ప్రజలు ఇచ్చిన తీర్పుతో ఇప్పటికే రాజకీయంగా తీవ్ర నష్టం వాటిల్లగా, ఇప్పుడు మళ్లీ రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రత్యేక ఉద్యమాల పేరుతో ప్రాంతీయ కార్డ్‌ను ఉపయోగిస్తే మిగిలిన కొద్దిపాటి రాజకీయ స్థానం కూడా కాలగర్భంలో కలిసిపోయే ప్రమాదం ఉంది. ఇప్పుడు ఓటర్లు వైరల్ కంటెంట్‌కే పరిమితం కావడం లేదు.. గందరగోళం సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలనుకునే వ్యూహాలు సుదీర్ఘకాలంలో వికటిస్తాయి. సెంటిమెంట్ రాజకీయాల కంటే అభివృద్ధి, ఆర్థిక పురోగతి, స్పష్టమైన భవిష్యత్తు ప్రణాళికలకే ప్రజలు ప్రాధాన్యమిస్తున్న తరుణంలో, ప్రాంతాల మధ్య విద్వేషాలను ప్రోత్సహించే విధానం వైఎస్సార్‌సీపీని మరింత రాజకీయంగా ఒంటరిని చేసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

## రేవంత్ లో ఫైర్ తగ్గుతుందా...

**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శైలి అనగానే ఎవరికైనా గుర్తొచ్చేది ఆయన దూకుడు, ప్రత్యర్థులపై విరుచుకుపడే నిరంతర ఎదురుదాడి. విపక్ష హోదాలో ఉన్నా, టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నా ఆయన వైఖరి ఎప్పుడూ ఆఫెన్సివ్‌గానే ఉండేది. అయితే, ఇటీవల సొంత నియోజకవర్గం కొడంగల్ సమావేశాల్లోనూ, ఇతర బహిరంగ వేదికలపైనా ఆయన మాట్లాడిన మాటలు రాజకీయ వర్గాల్లో సరికొత్త చర్చకు తెరలేపాయి. కొడంగల్ సహా పలు సభల్లో తనపై కుట్రలు చేస్తున్నారని అంటున్నారు. విపక్షాలు నన్ను పని చేసుకోనివ్వాలి.. నా గొంతు నొక్కాలని చూస్తున్నారు అంటూ సీఎం చేసిన వ్యాఖ్యలు ఆయన నిరంతర ఫైరింగ్ టోన్‌కు భిన్నంగా, ఒక రకమైన ఆవేదనను లేదా ఆత్మరక్షణ ధోరణిని ప్రతిబింబిస్తున్నాయనే అభిప్రాయం వినిపిస్తోంది. ఈ మార్పు వెనుక ఉన్న ప్రధాన కారణాలను పరిశీలిస్తే.. పరిపాలనలో ఎదురవుతున్న క్షేత్రస్థాయి సవాళ్లే మొదటిది. ఎన్నికల హామీలుగా ఇచ్చిన ఆరు గ్యారంటీలు పూర్తిస్థాయిలో నెరవేర్చడంలో ఎదురవుతున్న ఆర్థిక పరిమితులు, ఉపాధి హామీలు, పింఛన్ల పంపిణీపై విపక్షాల నుంచి వస్తున్న నిరంతర ఒత్తిడి ఒకవైపు కాగా హైడ్రా సృష్టించిన కలకలం, ప్రభుత్వాన్ని కొంత రక్షణత్మక వైఖరిలోకి నెట్టాయి. గడిచిన ఎనిమిది-తొమ్మిది నెలల పాలనలో ఊహించిన వేగంతో ప్రాజెక్టులు ముందుకు సాగకపోవడం, అనుకున్న స్థాయిలో నిధుల సమీకరణ కాకపోవడం వల్ల వచ్చిన అసంతృప్తి రేవంత్ రెడ్డి స్పీచ్‌లలో ప్రతిబింబిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు.మరోవైపు, కొడంగల్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఫార్మా సిటీ నిరసనలపై ప్రతిపక్షాలైన బిఆర్ఎస్ , బిజెపి సంయుక్తంగా తన రాజకీయ పునాదినే దెబ్బతీసేందుకు వ్యూహాలు రచిస్తున్నాయని సీఎం బహిరంగంగా ఆరోపించడం ఆయనలోని రాజకీయ భయాన్ని స్పష్టం చేస్తోందని విపక్ష నేతలంటున్నారు. తన సొంత నియోజకవర్గంలోనే ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని, తన పట్టును బలహీనపరిచేందుకు విపక్షాలు ఏకమవుతున్నాయని పదేపదే అనడం పార్టీ నేతలకు కూడా ఇబ్బందికరంగా ఉంది. కాంగ్రెస్ పార్టీ అంతర్గత సమీకరణలు కూడా రేవంత్ శైలిని ప్రభావితం చేస్తున్నాయి. ఒకవైపు ఢిల్లీ అధిష్టానం నిర్ణయాలపై ఆధారపడటం, మరోవైపు మంత్రివర్గంలోని సీనియర్ నేతల వైఖరి, అసంతృప్తుల సమన్వయం వంటి అంశాలు ఆయన స్వేచ్ఛాయుత నిర్ణయాధికారానికి అడ్డుకట్ట వేస్తున్నాయి. గతంలో ఫైర్ బ్రాండ్ నాయకుడిగా విమర్శలు చేసిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు ముఖ్యమంత్రి అనే రాజ్యాంగబద్ధమైన స్థానంలో ఉండటం వల్ల వ్యాఖ్యల్లో కొంత సంయమనం వహించాల్సి రావడం సహజమే అయినా.. నన్ను పని చేసుకోనివ్వడం లేదు అనే రక్షణాత్మక ధోరణి ప్రతిపక్షాలకు ఆయుధంగా మారుతోంది.రేవంత్ రెడ్డి మాటల్లో కనిపిస్తున్న ఈ హెచ్చుతగ్గులు కేవలం పాలనాపరమైన ఒత్తిడి వల్ల వచ్చినవి కావు. గ్రేటర్ ఎన్నికలు, కొడంగల్‌లో పట్టు నిలుపుకోవడం, విపక్షాల ఐక్య దాడిని తిప్పికొట్టే క్రమంలో ఆయన అమల్లోకి తెచ్చిన సెంటిమెంట్ కార్డ్ కూడా కావచ్చు. అయితే, ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న నాయకుడు ఆవేదన వ్యక్తపరిస్తే అది బలహీనతగా ప్రచారమయ్యే ప్రమాదం ఉంది

# అసెంబ్లీ హామీల్లో సగమే అమలు

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పుష్కరం పూర్తయింది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తర్వాత 2018లో జరిగిన ముందస్తు ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చింది. కేసీఆర్ సారథ్యంలో పాలన సాగింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రస్తుతం పాలన సాగుతోంది. అయితే రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రులు, మంత్రులు ఇచ్చిన హామీల అమలు పెద్ద సవాల్‌గా మారింది. ఇప్పటి వరకు సగం హామీలే నెరవేరాయని శాసనసభ హామీల అమలు కమిటీ స్వయంగా వెల్లడించింది.గడిచిన 12 ఏళ్లలో పాలకులు అసెంబ్లీ వేదికగా 2,266 హామీలు ఇచ్చారు. వీటిలో ఇప్పటి వరకు 1,092 అమలయ్యాయి. 1,174 హామీలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇందులో 750 హామీలు గత ప్రభుత్వ కాలంలో ఇచ్చినవి. అసెంబ్లీలో ఇచ్చే హామీలు ప్రజలకు ఇచ్చే నమ్మకం. అవి నెరవేరకపోతే ప్రభుత్వ వ్యవస్థపై నమ్మకం తగ్గుతుంది. రాష్ట్రం ఏర్పాటు తర్వాత ఇన్ని సంవత్సరాలు గడిచినా సగం హామీలు పెండింగ్‌లో ఉండటం చట్టసభపై అలసత్వం నిర్లక్ష్యాన్ని సూచిస్తోంది.గత ప్రభుత్వ హామీలు ఎక్కువగా మిగిలిపోవడం ఒక వైపు. ప్రస్తుత ప్రభుత్వం వాటిని సమీక్షించి పరిష్కరించాల్సిన బాధ్యత ఉంది. మంత్రి శ్రీధర్ బాబు, స్పీకర్ గడ్డం ప్రసాద్ సమక్షంలో జరిగిన సమావేశంలో పెండింగ్ హామీలపై చర్యలు తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. ఇది సానుకూల అడుగు. అయితే కేవలం సమీక్షతో






సరిపోదు. సమయ పట్టిక, బాధ్యతలు నిర్ణయించి, పురోగతిని క్రమం తప్పకుండా ప్రజలకు తెలియజేయాలి.హామీలు అమలు కాకపోవడంతో ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూరదు. అభివృద్ధి పథకాలు, సేవలు, స్థానిక సమస్యల పరిష్కారం ఆలస్యమవుతాయి. అసెంబ్లీలో ఇచ్చే హామీలు చట్టబద్ధమైన బాధ్యతగా పరిగణించబడాలి. లేకపోతే రాజకీయ ప్రకటనలు మాత్రమేగా మిగిలిపోతాయి. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకాన్ని బలహీనపరుస్తుంది. పెండింగ్ హామీలను ప్రాధాన్యత ఆధారంగా వర్గీకరించాలి. కొన్ని వెంటనే అమలు చేయగలిగేవి, కొన్ని దీర్ఘకాలిక ప్రణాళిక అవసరమైనవి. విభాగాల మధ్య సమన్వయం పెంచాలి. అమలు స్థితిని క్రమం తప్పకుండా అసెంబ్లీకి, ప్రజలకు నివేదించాలి. పారదర్శకత పెరిగితే నమ్మకం పునరుద్ధరణకు అవకాశం ఉంటుంది.

**వర్షపు నీటిని ఒడిసిపట్టుకోలేమా**

వర్షపు నీటిని ఒడిసిపట్టడంలో పాలకుల వైఫల్యం మరొక ఎత్తు. రాజకీయ నాయకులు కేవలం నీటి కేటాయింపులపైనే దృష్టి పెడుతున్నారు తప్ప వస్తున్న వరదను ఎలా నిల్వ చేయాలో ఆలోచించడం లేదు. పొరుగు రాష్ట్రాలపై బురదజల్లే బదులు

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com